


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 06-05-2026 | సంపుటి - 27 | సంచిక -344 | రూ : 4 | పేజీలు: 8




## ప్రాణహిత-చేవెళ్లపై
# కేంద్రం దృష్టి సారించాలి: డిప్యూటీ

- విభజన చట్టం ప్రకారం తెలంగాణ ప్రాజెక్టును గుర్తించాలని ప్రధానికి విజ్ఞప్తి
- గంభీరావుపేటలో బయో గ్యాస్ ప్లాంట్‌కు మంత్రులతో కలిసి భూమిపూజ
- రూ. 30 కోట్లతో 11 కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన
- మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు.. కేంద్రం సహకరించాలని కోరిన భట్టి విక్రమార్క
- పంట వ్యర్థాల నుంచి రైతులకు అదనపు ఆదాయం.. ఆధునిక సాగుపై దిశానిర్దేశం

2లో

## రైతన్న కంటకన్నీరు..
# ప్రభుత్వానికి పట్టదా?

- నర్సంపేట మార్కెట్ యార్డులో ధాన్యం కుప్పలను పరిశీలించిన కేటీఆర్
- మార్క్‌ఫెడ్ ఎండీకి ఫోన్.. కొనుగోళ్లలో జాప్యంపై నిలదీత

2లో






## యుద్ధం కొనసాగితే
# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు

- 125 డాలర్లకు చేరనున్న చమురు
- వృద్ధి రేటు పతనమే..ఆకాశాన్ని అంటనున్న ధరలు
- ఐఎంఎఫ్ చీఫ్ హెచ్చరిక

వాషింగ్టన్: పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు ప్రపంచ ఆర్థిక పునాదులను కదిలించేలా మారుతున్నాయి. ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య సాగుతున్న ఈ ఘర్షణలు గనుక 2027 వరకు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఊహించని రీతిలో పతనమయ్యే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా

తరువాయి 2లో

## దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు
# పచ్చజెండా

- జూన్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభం
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన రైల్వే శాఖ
- ఇకపై సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లతోనే ద.మ. రైల్వే

2లో







# కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి

- హార్ముజ్‌లో మళ్లీ కాల్పుల మోతలు
- మా నౌకలపై దాడి చేస్తే తుడిచిపెడతాం : ట్రంప్
- దూకుడుగా వ్యవహరిస్తే ఊబిలో పడతారు : ఇరాన్
- యూఏఈ ఓడరేవుపై ఇరాన్ డ్రోన్ దాడి
- ముగ్గురు భారతీయులకు గాయాలు

2లో



# మెట్రో రెండో దశకు అనుమతులివ్వండి

- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- నేడు దిల్లీలో కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: మెట్రోరైలు రెండో దశకు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా కేంద్రానికి లేఖ రాసింది. హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రాజెక్ట్‌లో

తరువాయి 2లో

## శంషాబాద్‌లో రూ.453 కోట్లతో
# ఏరోస్పేస్ ప్లాంట్ ప్రారంభం

- అంతర్జాతీయ స్థాయి ఏరో ఇంజిన్ విడిభాగాల తయారీ కేంద్రానికి మంత్రి శ్రీధర్ బాబు భూమిపూజ

హైదరాబాద్, మే 5 : శంషాబాద్ హార్డ్‌వేర్ పార్కు (ఫేజ్ III)లో రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల విస్తీర్ణంలో 'ఐటీపీ ఏరో ఇండియా' ప్లాంట్ ఏర్పాటు కానుంది. దీనికి మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు. విమాన ఇంజిన్ల రిజిడ్ ట్యూబ్స్‌కు అవసరమయ్యే ఎండ్‌ఫిట్టింగ్స్, బ్రాకెట్లను ఈ సంస్థ ఉత్పత్తి చేయనుంది.

తరువాయి 2లో





# రేపే విజయ్ ప్రమాణం?

- ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం
- గవర్నర్‌కు టీవీకే అధినేత విజయ్ లేఖ
- టీవీకే మా మద్దతు కోరింది: కాంగ్రెస్
- నిర్ణయం రాష్ట్ర నేతలకే వదిలేశామని వెల్లడి

2లో

# ప్రాణహిత-చేవెళ్లపై కేంద్రం దృష్టి సారించాలి: డిప్యూటీ సీఎం డిమాండ్

రాజన్న సిరిసిల్ల, మే 5: ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణకు చెందిన ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాల్సిన అవసరం ఉందని ఆయన ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో మంగళవారం బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి భూమిపూజ చేశారు. అలాగే, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లోని 11 ప్రాంతాల్లో సుమారు రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి, రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర (MSP) ప్రకారమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తీసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ రంగంలో కొత్త మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పంట కోతల అనంతరం గడ్డిని కాల్చడం వల్ల పర్యావరణం దెబ్బతింటున్న నేపథ్యంలో, దానిని బయోగ్యాస్ ఉత్పత్తికి వినియోగించే విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించవచ్చని ఆయన అన్నారు. పంట మార్పిడి విధానాన్ని రైతులు తప్పనిసరిగా అనుసరించాలని సూచించిన ఆయన, వరి పంటపై మాత్రమే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయక పంటల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆధునిక సాగు పద్ధతులతోనే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డీఎస్పీ నాగేంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ మల్లుగారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధం కొనసాగితే
# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు

వాషింగ్టన్: పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు ప్రపంచ ఆర్థిక పునాదులను కదిలించేలా మారుతున్నాయి. ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య సాగుతున్న ఈ ఘర్షణలు గనుక 2027 వరకు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఊహించని రీతిలో పతనమయ్యే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా హెచ్చరించారు. మిల్కెన్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. యుద్ధం త్వరగా ముగిసిపోతుందన్న ఆశలు క్రమంగా ఆవిరైపోతున్నా యన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తాము అంచనా వేసిన 3.1 శాతం ప్రపంచ వృద్ధి రేటు, 4.4 శాతం ద్రవ్యోల్బణ గణాంకాలు ఇక ఏమాత్రం సాధ్యం కాకపోవచ్చన్నారు. ముఖ్యంగా యుద్ధం సుదీర్ఘకాలం పాటు కొనసాగితే ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 125 డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేశారు. తద్వారా ద్రవ్యోల్బణం నియంత్రణ కోల్పోయి ధరలు ఆకాశాన్ని తాకుతాయని జార్జివా హెచ్చరించారు. ఇప్పటికే చమురు ధరలు 100 డాలర్ల దరిదాపుల్లో ఉండటంతో ప్రపంచం ఇప్పటికే ప్రతికూల స్థితిలోకి ప్రవేశించిందని ఆమె విశ్లేషించారు. ఐఎంఎఫ్ అంచనా ప్రకారం.. పరిస్థితి ఇలాగే ఉంటే 2026 నాటికి ప్రపంచ వృద్ధి రేటు 2.5 శాతానికి పడిపోయి, ద్రవ్యోల్బణం 5.4 శాతానికి పెరుగుతుంది. ఒకవేళ యుద్ధం మరింత తీవ్రమైతే ప్రపంచ వృద్ధి కేవలం 2 శాతానికి పరిమితమై.. ద్రవ్యోల్బణం 5.8 శాతానికి చేరొచ్చని ఇది ప్రపంచ దేశాల్లో ఆర్థిక మాంద్యానికి దారితీస్తుందని హెచ్చరించారు. చమురు సరఫరా విషయంలో ఎదురయ్యే అతిపెద్ద సవాలును షెవ్రాన్ సిఇఒ మైక్ విర్త్ వివరించారు. ప్రపంచ ముడి చమురు సరఫరాలో 20 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధి గనుక యుద్ధం కారణంగా మూతపడితే ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత ఏర్పడటం ఖాయమని ఆయన పేర్కొన్నారు. దీని ప్రభావం తొలుత ఆసియా ఖండంలోని దేశాలపై తీవ్రంగా ఉంటుందన్నారు. ఇంధన సరఫరా నిలిచిపోవడంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు కుంచించుకుపోతాయని హెచ్చరించారు. ఎరువుల ధరలు 40 శాతం పెరగొచ్చు..కేవలం ఇంధన ధరలే కాకుండా సామాన్యుడి ఆహార భద్రతపై కూడా ఈ యుద్ధం పెను ప్రభావం చూపనుంది. ఇప్పటికే సరఫరా గొలుసులో ఏర్పడిన ఆటంకాల వల్ల ఎరువుల ధరలు 30 శాతం నుండి 40 శాతం వరకు పెరిగాయన్నారు. దీని ఫలితంగా ఆహార వస్తువుల ధరలు 3 శాతం నుండి 6 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని జార్జివా తెలిపారు. ఈ సంక్షోభం త్వరలో ముగిసిపోతుందని భావించి వినియోగాన్ని తగ్గించకుండా ఉండటం అంటే మండుతున్న మంటల్లో పెట్రోల్ పోయడమేనని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు.

# రైతన్న కంటకన్నీరు.. ప్రభుత్వానికి పట్టదా?

నర్సంపేట/గీసుగొండ, మే 5: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులోని పరిస్థితులను ఆయన పరిశీలించారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న సమస్యలను కేటీఆర్‌కు వివరించారు. ధాన్యం కొనుగోళ్లు, మార్కెట్ సదుపాయాలు, చెల్లింపుల ఆలస్యం వంటి అంశాలపై తమ ఇబ్బందులను రైతులు వివరించారు. అలాగే, పరకాల నియోజకవర్గం, గీసుగొండ ఊకల్ సొసైటీలోని మక్కల కొనుగోలు కేంద్రంలో రైతులు కేటీఆర్‌కు సమస్యను విన్నవించారు. కష్టపడి పండించిన పంటను కొనాలని మార్క్‌ఫెడ్ అధికారులకు, కలెక్టర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు ఈ సందర్భంగా వాపోయారు. మక్కల కొనుగోళ్లలో జరుగుతున్న నిర్లక్ష్యంపై మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డికి కేటీఆర్ ఫోన్ చేసి మాట్లాడారు. జాప్యంపై నిలదీశారు. మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో మాట్లాడి పంట కొనుగోళ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని, మార్క్‌ఫెడ్ వైఫల్యాన్ని నిలదీశారు. కేటీఆర్ రైతన్నలు పండించిన పంట కొనేది ఉందా లేదా అంటూ ప్రశ్నించారు. కేటీఆర్ వెంట బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో రూ.453 కోట్లతో ఏరోస్పేస్ ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్, మే 5: శంషాబాద్ హార్డ్‌వేర్ పార్కు (ఫేజ్ III)లో రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల విస్తీర్ణంలో 'ఐటీపీ ఏరో ఇండియా' ప్లాంట్ ఏర్పాటు కానుంది. దీనికి మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భూమి పూజ చేశారు. విమాన ఇంజిన్ల రిజిడ్ ట్యూబ్స్‌కు అవసరమయ్యే ఎండ్ ఫిట్టింగ్స్, బ్రాకెట్లను ఈ సంస్థ ఉత్పత్తి చేయనుంది. 2027 నాటికి ఈ ప్లాంటులో ఉత్పత్తి పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేయడం గౌరవంగా భావిస్తున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రిసిషన్ ఇంజినీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో కొత్తగా 350 మంది ఇంజినీర్లు, తయారీ రంగ నిపుణులకు ఉపాధి లభించనుంది. భవిష్యత్ కాలంలో ఈ సంఖ్య 600 వరకు పెరిగే అవకాశాలున్నాయి. ఏరోస్పేస్, అధునాతన తయారీ రంగాల్లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. తెలంగాణ పారిశ్రామిక రంగంలో ఒక మైలురాయిగా నిలవనుంది.

**ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి..**

శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పారిశ్రామిక వృద్ధిని పెంపొందించడం, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలను సృష్టించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఏరోస్పేస్, అధునాతన తయారీ రంగాల్లో తెలంగాణను ప్రపంచ స్థాయి కేంద్రంగా బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

# కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి

టెహ్రాన్ : మధ్యప్రాచ్యంలో మరోసారి ఘర్షణలు మొదలయ్యాయి. ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నదీ లేనిదీ తెలియని పరిస్థితి నెలకొంది. హోర్ముజ్ జలసంధిలో ఇరు పక్షాలు కాల్పులకు దిగాయి. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నదా అని అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. ఇరాన్ వైపు నుంచి దూసుకొచ్చిన 19 క్షిపణులు, డ్రోన్లను తన గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని, డ్రోన్ దాడిలో ఫుజైరా ప్రాంతంలోని చమురు ఓడరేవు వద్ద మంటలు వ్యాపించాయని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తెలిపింది. ఇదిలావుండగా పర్షియన్ గల్ఫ్‌లో తమ నౌకలపై దాడి చేస్తే ఈ భూమి పైనే లేకుండా తుడిచిపెడతానని ఇరాన్ దళాలను ట్రంప్ హెచ్చరించారు. రాజకీయ సంక్షోభానికి సైనిక పరిష్కారం ఉండదు : ఇరాన్ రాజకీయ సంక్షోభానికి సైనిక పరిష్కారం ఉండదని హోర్ముజ్‌లో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు నిరూపిస్తున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ చెప్పారు. దుందుడుకు చర్యలకు పాల్పడితే ఊబిలో కూరుకుపోతారని ఆయన అమెరికా, యూఏఈలను హెచ్చరించారు. పాకిస్తాన్‌తో జరుపుతున్న చర్చలు పురోగతిలో ఉండగానే అమెరికా ఊబిలోకి దిగుతోందని, దాని మిత్రదేశం యూఏఈ కూడా అదే పని చేస్తోందని అన్నారు. హోర్ముజ్ జలసంధి నుంచి నౌకలను బయటికి పంపే విషయంలో సాయపడడానికి అమెరికా ముందుకు తెచ్చిన 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' ప్రణాళికను ఆయన ఎద్దేవా చేశారు. ఆమోదయోగ్యం కాదు : కేంద్రం యూఏఈలోని ప్రధాన చమురు ఓడరేవుపై జరిగిన దాడిలో ముగ్గురు భారత జాతీయులు గాయపడడంపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఈ చర్య ఆమోదయోగ్యం కాదని తెలిపింది. 'శత్రుత్వానికి వెంటనే స్వస్తి చెప్పాలని, పౌర మౌలిక సదుపాయాలను, ప్రజలను లక్ష్యంగా చేసుకోవడం ఆపేయాలని మేము కోరుతున్నాం' అని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సమస్యను పరిష్కరించుకోవాలన్న తన వైఖరిని పునరుద్ఘాటించింది. మంటల్లో చిక్కుకున్న దక్షిణ కొరియా నౌక ఇదిలావుండగా దక్షిణ కొరియాకు చెందిన ఓ నౌక సోమవారం హోర్ముజ్‌లో మంటలలో చిక్కుకుంది. అంతకుముందు నౌకలో పేలుడు సంభవించింది. నౌకను తనిఖీ చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు సమీపంలోని ఓడరేవుకు తరలిస్తున్నారు. అగ్నిప్రమాదానికి కారణమేమిటో తెలుసుకునేందుకు విచారణ జరుపుతున్నామని సియోల్ విదేశాంగ శాఖ తెలిపింది.

# రేపే విజయ్ ప్రమాణం?

చెన్నై, దిల్లీ: తమిళనాడు ముఖ్యమంత్రిగా సినీనటుడు, టీవీకే అధినేత విజయ్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7న (గురువారం) ఈ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు తమ పార్టీని ఆహ్వానించాలని గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ కార్యాలయానికి విజయ్ లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక 15రోజుల్లో అసెంబ్లీలో బలం నిరూపించుకుంటామని తెలిపారు. కేరళ పర్యటనలో ఉన్న గవర్నర్ బుధవారం చెన్నైకి తిరిగి వచ్చే అవకాశముంది. ఆ వెంటనే విజయ్ బృందం గవర్నర్‌ను కలిసి నూతన ప్రభుత్వ ఏర్పాటుపై చర్చిస్తారని టీవీకే వర్గాలు వెల్లడించాయి.

**శాసనసభా పక్ష నేతగా ఎన్నిక**

విజేతలైన ఎమ్మెల్యే అభ్యర్థులతో చెన్నై సమీప పనైయూర్‌లోని టీవీకే ప్రధాన కార్యాలయంలో మంగళవారం విజయ్ భేటీ అయ్యారు. అనంతరం తమ శాసనసభాపక్ష నేతగా విజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు తమ ఎమ్మెల్యేలను భద్రంగా చూసుకునేందుకు మామల్లపురంలోని ఓ స్టార్ హోటల్‌ను అద్దెకు తీసుకున్నారు.

**విజయ్‌కి కాంగ్రెస్ మద్దతు!**

విజయ్‌కి మద్దతివ్వడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ తమ సహాయం కోరారని, ప్రజాతీర్పును దృష్టిలో ఉంచుకొని వెంటనే దీనిపై నిర్ణయం తీసుకోవాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీని ఆదేశించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ దిల్లీలో వెల్లడించారు. 234 స్థానాలున్న అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 118 మంది ఎమ్మెల్యేలు అవసరం.

# దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పచ్చజెండా

దిల్లీ, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇప్పుడున్న గుంతకల్లు, గుంటూరు, విజయవాడతోపాటు వాల్తేరు డివిజన్ స్థానంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విశాఖపట్నం డివిజన్‌తో కలిపి మొత్తం నాలుగు డివిజన్లతో ఈ కొత్త జోన్ పని చేయనుంది. ఈ మేరకు రైల్వే శాఖ తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం2014లోని షెడ్యూల్ 13(8)లో ఇచ్చిన కీలక హామీ నెరవేరినట్లైంది. 'ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైల్వే జోన్ ఏర్పాటుపై రైల్వే శాఖ రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి ఆరు నెలల్లోపు పరిశీలించి, వేగంగా నిర్ణయం తీసుకుంటుంది' అని విభజన చట్టంలో ఇచ్చిన హామీ... 12 ఏళ్ల తర్వాత సాకారమవుతోంది. ఏప్రిల్ 28న విశాఖపట్నంలో జరిగిన గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ జూన్ 1 నుంచి కొత్త రైల్వే జోన్ ప్రారంభమవుతుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ప్రకటించారు. వారం రోజుల్లోనే సంబంధిత గెజిట్ నోటిఫికేషన్ జారీ అయ్యేలా చూశారు. దీంతో భారతీయ రైల్వేలో మొత్తం జోన్ల సంఖ్య 18కి చేరనుంది.

**కుంచించుకుపోనున్న ద.మ. రైల్వే**

సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధి భారీగా తగ్గనుంది. ప్రస్తుతం ఈ జోన్‌లో రైల్వే ట్రాక్ 6,637 కిమీ ఉండగా... ఇకపై అది 3,589 కిమీకి పరిమితం కానుంది. ఇప్పటివరకు ద.మ.రైల్వేలో సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు... ఆరు రైల్వే డివిజన్లు ఉన్నాయి. ఇందులో విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లోకి వెళ్లనున్నాయి.

**నెరవేరని కొత్త డివిజన్ కల**

తెలంగాణలో కాజీపేట కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉంది. ద.మ.రైల్వే పునర్విభజనతో డివిజన్ల సంఖ్య మూడుకే పరిమితమవుతున్న నేపథ్యంలోనైనా అది సాకారం అవుతుందని భావించగా నిరాశే మిగిలింది. దీంతో మిగిలిన మూడింట్లో హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజన్లు రాష్ట్రంలో ఉండగా, మరోటి నాందేడ్ డివిజన్ మహారాష్ట్రలో ఉంది.

*** ఆదాయం, ఆపరేషనల్ విస్తీర్ణంలో తగ్గుదల**

ద.మ.రైల్వే మూడు డివిజన్లకే పరిమితం కానుండటంతో ఈ జోన్‌కు సంబంధించిన రూట్ కిలోమీటర్లు, ఆదాయం, ఆపరేషనల్ విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. సరకు రవాణా, ఆదాయం వచ్చే విజయవాడ, గుంతకల్లు డివిజన్లు కొత్త జోన్‌లోకి వెళుతున్నాయి. రైళ్ల కంట్రోల్, షెడ్యూలింగ్‌లో మార్పులు... డివిజన్లతో పాటు ఇక జోన్ల మధ్య కూడా సమన్వయం ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

**ద.మ.రైల్వే స్వరూపం ఇలా...**

ద.మ.రైల్వే పునర్విభజన, దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటు నేపథ్యంలో సికింద్రాబాద్, గుంటూరు, గుంతకల్లు.. మూడు డివిజన్ల సరిహద్దుల్లో మార్పులు చేర్పులు జరగనున్నాయి.

మోటుమర్రి (మినహాయించి)కొండపల్లి సెక్షన్: ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్‌లో ఉంది. 46 కిమీ ఉన్న ఈ సెక్షన్.. దక్షిణ కోస్తా జోన్‌లోని విజయవాడ డివిజన్‌కు వెళుతుంది. కొండపల్లి పవర్‌ప్లాంట్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ సెక్షన్‌ను విజయవాడ డివిజన్‌లో రైల్వేశాఖ కలిపింది. అయితే మోటుమర్రి రైల్వేస్టేషన్‌ను మాత్రం సికింద్రాబాద్ డివిజన్‌లోనే కొనసాగిస్తున్నారు. మోటుమర్రి నుంచి మరోవైపు విష్ణుపురం వరకు సెక్షన్ ఉంది. ఈ మార్గంలో సిమెంట్ లోడింగ్‌కు జోన్ నుంచి అనుమతుల ఇబ్బందులు లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు.

విష్ణుపురంపగిడిపల్లి సెక్షన్: గుంటూరు డివిజన్‌లో ఉంది. దీంతోపాటు మిర్యాలగూడ, నల్గొండ, పగిడిపల్లి సెక్షన్ వరకు గుంటూరు డివిజన్‌లోనే ఉంది. ఈ మొత్తం 142 కిమీ రైల్వే మార్గాన్ని గుంటూరు నుంచి సికింద్రాబాద్ డివిజన్‌కు రైల్వే శాఖ బదలాయించింది. నల్గొండ జిల్లా దామరచర్లలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఉంది. సింగరేణి నుంచి బొగ్గు వస్తుంది. ఈ రెండు ప్రాంతాలు తెలంగాణలోనే ఉండటంతో గుంటూరు డివిజన్ నుంచి సికింద్రాబాద్ డివిజన్‌లో కలిపింది.

రాయచూరు వాడి సెక్షన్: కర్ణాటకలోని రాయచూరు నుంచి మహారాష్ట్రలోని వాడి వరకు 108 కిమీ మార్గం. ఇది ప్రస్తుతం గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో ఉంది. ఈ సెక్షన్‌లో రెండు పవర్ ప్లాంట్లు ఉన్నాయి. వాటికి తెలంగాణ నుంచే బొగ్గు వెళుతుంది. ఇంకా సికింద్రాబాద్ నుంచి కర్ణాటక, మహారాష్ట్రకు నడిపే రైళ్లకు ఇబ్బంది లేకుండా సికింద్రాబాద్ డివిజన్ ద.మ.రైల్వే జోన్‌కు బదలాయించారు.

**దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కి మధిర**

ఖమ్మం జిల్లా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం మధిర విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటవుతున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లోకి వెళ్లనుంది. మోటుమర్రి (మినహాయించి)కొండపల్లి సెక్షన్‌ను విజయవాడ డివిజన్‌లో కలిపారు. ఈ సెక్షన్‌లో తెలంగాణలో మోటుమర్రిని మినహాయించి.. ఆ తర్వాత వచ్చే మధిర, తొండలగోపవరం, ఎర్రుపాలెం మూడు స్టేషన్లు కొత్త జోన్ దక్షిణ కోస్తా పరిధిలోకి వెళతాయి.

# మెట్రో రెండో దశకు అనుమతులివ్వండి

హైదరాబాద్: మెట్రోరైలు రెండో దశకు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా కేంద్రానికి లేఖ రాసింది. హైదరాబాద్ మెట్రో మొదటి దశ ప్రాజెక్ట్‌లో వందశాతం షేర్ల కొనుగోలుతో ప్రాజెక్ట్‌ను గత నెల 30న ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలుపుతూ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు.. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శికి లేఖ రాశారు. ప్రభుత్వం మెట్రోను స్వాధీనం చేసుకోవడంతో ఇప్పటివరకు కేంద్రం లేవనెత్తిన అభ్యంతరాలు తొలగిపోయాయని.. ఇకనైనా రెండోదశ ఎ, బి భాగంలోని ఏడు మార్గాల సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్)లను ఆమోదించాలని లేఖలో కోరారు. ఇదే విషయంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ ఖట్టర్‌ను కలవడానికి బుధవారం ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంషాబాద్ విమానాశ్రయం నుంచి దిల్లీకి వెళ్లనున్నారు. మెట్రో మొదటి దశ స్వాధీనం గురించి వివరించి.. రెండోదశను సత్వరం ఆమోదించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున వినతిపత్రాన్ని అందజేయనున్నారు. ఈ నెల 10న ప్రధానమంత్రి హైదరాబాద్ రానుండడంతో..ఆ పర్యటనలోనూ మెట్రో రెండోదశ విస్తరణతో పాటు.. రాష్ట్రానికి రావాల్సిన పలు అంశాలపై మోదీని కలిసి సీఎం వివరించనున్నారు.

**ఏడాదిన్నరగా ఎదురుచూపులు...**

మెట్రో రెండోదశ ప్రతిపాదనలు, డీపీఆర్‌లను 2024 నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో తలపెట్టిన రెండోదశకు అనుమతి ఇవ్వాలంటే.. ఆపరేషన్ పరంగా సమన్వయం కోసం మొదటిదశ ప్రాజెక్ట్‌ను నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీతో కచ్చితమైన ఒప్పందం చేసుకోవాలని కేంద్రం మెలిక పెట్టింది. ఇప్పుడు ఎల్అండ్‌టీ నుంచి మెట్రో పగ్గాలు సర్కారు చేతికి రావడంతో.. కేంద్ర అభ్యంతరాలు తొలగిపోయాయి. మొదటి దశ, రెండో దశ సర్కారు యాజమాన్యంలో ఉండబోతున్నాయి.

# రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ఆసక్తి కనబరచాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : పట్టణంలోని గిరిజన భవన్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతువారంలో భాగంగా మహబూబాబాద్ నియోజకవర్గ స్థాయి పంట మార్పిడి ద్వారా ఉద్యాన పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు అవగాహన సదస్సును జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ, తెలంగాణ ఆయిల్ ఫెడ్, వ్యవసాయ శాఖ, సహకార శాఖ,మార్కెటింగ్ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన పరిశోధన స్థానం, ఉద్యాన కళాశాల, పశు సంవర్ధక శాఖ వారి సహకారంతో నిర్వహించారు.మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని, నిత్యం రోగనిరోధక శక్తికి, ఆరోగ్యంగా ఉండటానికి పోషకాలు అందించే పండ్ల తోటలు అయిన జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్, కూరగాయలు, ఆకు కూరలు, మునగ, వెదురు మొదలైనవి సాగు చేయాలని తద్వారా ఎకరానికి లక్ష రూపాయలు నికర ఆదాయం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రో ట్రే లో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ గుగులోతు జ్యోతి, వ్యవసాయ మార్కెట్ వైస్ ఛైర్మన్ కమిటీ మదన్ గోపాల్ లోయా, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయ అధికారి బి. సరిత, జిల్లా సహకార అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. బోడె పూడి కిరణ్ కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ. శ్రీనివాస రావు,వార్డ్ కౌన్సిలర్ ఎస్. దిలీప్, ఆయిల్ పామ్ స్టేట్ కౌన్సిల్ మెంబర్ వల్లూరి కృష్ణ రెడ్డి, ఆయిల్ పామ్ అభ్యుదయ రైతు డా. యానాల ఇంద్ర సేనా రెడ్డి, ఆయిల్ పామ్ అభ్యుదయ రైతు బొబ్బల యాకూబ్ రెడ్డి, ఆయిల్ పామ్ అభ్యుదయ రైతు మిట్టకంటి ఉపేందర్ రెడ్డి, మల్బరీ అభ్యుదయ రైతు వేం పార్థ సారధి రెడ్డి, ఉద్యాన అధికారి శాంతి ప్రియదర్శిని, వ్యవసాయ అధికారులు తిరుపతి రెడ్డి, అబ్దుల్ మాలిక్, రాజు, పలువురు ఆయిల్ ఫెడ్ విస్తరణ సిబ్బంది, వ్యవసాయ, ఉద్యాన విస్తరణ అధికారులు , రైతులు పాల్గొన్నారు.

## నిబద్ధతకు నిదర్శనం

### జనగాం సీఐ కు అభినందన పురస్కారం




జనగామ, ప్రజాస్ఫూర్తి : చట్టాల అమలులో కఠిన చర్యలు తీసుకుంటూ శాంతి భద్రతలను కాపాడడంలో విశేష కృషి చేసిన జనగాం సీ.ఐ సత్యనారాయణ రెడ్డికి అభినందన పురస్కారం లభించింది. మంగళవారం ఐటి నిబంధనలు, సీఓటీపీఏ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు, డ్రగ్ నియంత్రణలో ఈగిల్ యాక్షన్ గ్రూప్ (ఈగాల్ టీమ్) ద్వారా చేసిన సేవలకు గాను వరంగల్ పోలీస్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. చట్టాల అమలులో క్రమశిక్షణ, ప్రజల భద్రత పై అప్రమత్తత, నేరాల నియంత్రణ లో చూపిన చొరవకు ఈ గుర్తింపు లభించినట్లు అధికారులు పేర్కొన్నారు. సీ.ఐ సత్యనారాయణ రెడ్డి చేస్తున్న సేవలు పోలీస్ శాఖ కు ఆదర్శంగా నిలుస్తున్నాయని సహచరులు అభినందించారు.

## అవగాహన లేకపోవడమే శాపం

* **జిల్లా న్యాయ సేవాధికార సంస్థ**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: చట్టాలపై సరైన కనీస అవగాహన లేకపోవడం వలనే చాలావరకు గిరిజన ప్రాంతాల్లో సమస్యలు బయటికి రావడం లేదని అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ వి రాజ్ కృష్ణ అన్నారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గౌరారం గ్రామపంచాయతీ పరిధిలోగల కోడిపుంజుల తండాలో " సురక్షిత బచ్పన్ సురక్షిత భవిష్యత్ " అనే నినాదంతో లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం 2012 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.18 ఏళ్లలోపు పిల్లలపై జరిగే ఎటువంటి లైంగిక దాడులైనా, వేధింపులైనా తీవ్రమైన నేరాలని, వీటికి కఠిన శిక్షలు ఉంటాయని వారు వివరించారు.బాధితుల పేర్లు, చిరునామాలు మరియు ఫోటోలను ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టకూడదని, వారి గోప్యతను కాపాడటం చట్టం బాధ్యత అని స్పష్టం చేశారు.నేరానికి గురైన బాలలకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందేలా న్యాయ సేవాధికార సంస్థ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. చిన్నారులపై ఎటువంటి వివక్షత చూపిన తక్షణమే టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన తండా యువజన అధ్యక్షుడు శ్రీకాంత్,పారా లీగల్ వాలంటీర్ మహేష్‌లను అభినందించారు.

## భూపాలపల్లిలో గండ్ర బర్త్ డే వేడుకలు



భూపాలపల్లి , ప్రజాస్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి జన్మదిన వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కార్యాలయం నినాదాలతో మార్మోగింది. గండ్ర యువసేన నియోజకవర్గ అధ్యక్షుడు కరాటే శీను ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి డాన్స్ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటింది. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆంజనేయస్వామి మాలధారణ భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గండ్ర మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## మక్కల కొనుగోలు కేంద్రంలో సమస్యల పర్వం

* **రైతుల తో కేటీఆర్ భేటీ**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో మక్కల కొనుగోలు ఆలస్యం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం మండ లంలోని యశ్వంతపూర్ గ్రామ మక్కల కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ సందర్శించారు. కేంద్రం లో పరిస్థితులను పరిశీ లించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దాదాపు 20 రోజులుగా మక్కల కొనుగోలు ప్రారంభం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గన్నీ సంచులు కూడా అందుబాటులో లేకపోవడంతో పంటను నిల్వ చేయడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పై స్పందించిన కేటీఆర్, ప్రభుత్వం తీరు పై తీవ్ర విమర్శలు చేశారు. "రైతు కష్టాన్ని ప్రభుత్వం పట్టించు కోవడం లేదు. మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయక పోవడం రైతులను మోసం చేయడమే. వెంటనే మక్కల కొనుగోలు ప్రారంభించాలి. రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు" అని అన్నారు. పంట పాడైపోతే బాధ్యత ఎవరిది అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆయన, రైతు సమస్యల పై రాజకీయాలు చేయకుండా తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.మొత్తానికి జిల్లాలో మక్కల కొనుగోలు ఆలస్యం రైతుల్లో ఆందోళనకు దారితీస్తోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

## సభ్యుల సంక్షేమమే లక్ష్యం – అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ



సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి : సైబరాబాద్ పోలీస్ పరిధిలోని హోం గార్డ్స్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ మొదటి జనరల్ బాడీ మీటింగ్ మంగళవారం సైబరాబాద్ సీపీ ఆఫీస్ లో ఆడిటోరియం లో నిర్వహించారు. ఈ సమావేశంలో సొసైటీ కార్యకలాపాలు, సభ్యుల సంక్షేమం, భవిష్యత్ ప్రణాళికలు , ఆర్థిక వ్యవహారాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ మాట్లాడుతూ రాష్ట్రంలోని మొట్టమొదటి గా ఏర్పాటు చేసిన సైబరాబాద్ హోం గార్డ్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మంచి స్థాయిలో పని చేస్తోందన్నారు. సభ్యులకు అన్ని విషయాలను పారదర్శకంగా తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహించామని చెప్పారు. సొసైటీకి సభ్యుల నుంచి మంచి సహకారం లభిస్తోందని, ఇదే విధంగా కొనసాగించాలని సూచించారు. సభ్యుల సంక్షేమానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టి, అవసరమైన తీర్మానాలను అమలు చేస్తామని తెలిపారు. సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ సహకారంతో సొసైటీ విజయవంతంగా నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ కోపరేటివ్ సొసైటీ ఇంచార్జి ఎస్సై మల్లేశం తీర్మానాలు ప్రవేశపెట్టారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, అడ్మిన్ ఏడీసీపీ ఎఫ్. రెహమాన్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, హోంగార్డ్స్ వెల్ఫేర్ ఆర్ఐ విజయానంద్, సైబరాబాద్ కోపరేటివ్ సొసైటీ ఇంచార్జి ఎస్సై మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు త్వరగా పూర్తి చేసి, ధాన్యం బస్తాలను లారీల ద్వారా సకాలంలో మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు ఆదేశించారు. మంగళవారం రఘునాథపల్లి మండల కేంద్ర పరిధిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం, కంచన పల్లి గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కాంటా ప్రక్రియ, లారీలు సమయానికి వస్తున్నాయా, తాడిపత్రిలు సరిపడా ఉన్నాయా వంటి అంశాల పై కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని, రైతులు వేచి చూడాల్సిన పరిస్థితి రాకుం డా చూడాలని సూచించారు. గన్నీ బ్యాగులు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, రవాణా ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. తేమ శాతం (ఎఫ్.ఏ.క్యూ ప్రమా ణాల) ప్రకారం ధాన్యం స్వీకరించి , రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రాల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం రఘునాథపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, వైద్య సేవలు, సిబ్బంది హాజరు, మందుల లభ్యత, పరిశుభ్రత వంటి అంశాలను సమీక్షించారు. రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలుకు సహకరించాలి

* **వరి ధాన్యాన్ని ఆరబెట్టుకొని మార్కెట్ యార్డుకు తీసుకురావాలి.**
* **హుస్నాబాద్ మార్కెట్ యార్డ్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ కే.హైమావతి**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : రైతులు వరి ధాన్యాన్ని తేమ శాతం వచ్చేవరకు వ్యవసాయ క్షేత్రాల వద్దనే అరబెట్టుకుని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలని, వ్యవసాయ మార్కెట్ లో ధాన్యం ఆరబెట్టడం వలన అకాల వర్షాలు వలన పెద్ద ఎత్తున నష్టంవాటిల్లుతుందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం లో మక్కలు, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ మార్కెట్ మరియు గ్రామాల్లో పలు వరి కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ క్షేత్రాల వద్ద ఆరబెట్టి తేమ శాతం వచ్చిన తర్వాతనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ మార్కెట్ లో మక్కలు, వరి ధాన్యానికి సరిపడ స్థలం లేనందున వరి ధాన్యాన్ని మీకు దగ్గరలోని గ్రామాల వరి కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని, ఏఎంసి లో వరి ధాన్యం ఆరబెట్టడం వలన అకాల వర్షాల వలన ఎక్కువ మొత్తంలో నష్టంవాటిల్లుతుందని ఇట్టి విషయాన్ని రైతులు గమనించాలని, మక్కలను వ్యవసాయ మార్కెట్ లో కొనుగోలు చేస్తామని తెలిపారు. మక్కల విభాగం ప్రాంతంలో వరి ధాన్యం పొయ్యకూడదని, అలాగే ఏఎంసి లో పల్లపు ప్రాంతంలో ధాన్యం ఆరబెట్టకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చెయ్యడం జరిగిందని దయచేసి పల్లపు ప్రాంతంలో ధాన్యాన్ని పొయ్యకుండా చర్యలు తీసుకోవాలని ఏఎంసి అధికారులను ఆదేశించారు. తేమ శాతం వచ్చి లిఫ్ట్ చెయ్యడానికి ధాన్యం తయారుగా ఉందని రైతులు కలెక్టర్ కి తెలపగా వెంటనే డిఎం సివిల్ సప్లై కి ఫోన్ చేసి సరిపడినన్ని లారీలను పంపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామ్మూర్తి, ఏఎంసి ఛైర్మన్ తిరుపతి రెడ్డి ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిపో పని తీరుపై ప్రశంసలు

* **బస్సుల టైమింగ్స్ క్యాలెండర్ విడుదల**

జనగామ,ప్రజాస్ఫూర్తి : వరంగల్ రీజినల్ మేనేజర్ ఎస్. భావానీ ప్రసాద్ జనగామ డిపో ను మంగళవారం సందర్శించి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. డిపోకు విచ్చేసిన ఆయన, డిపోలోని అన్ని విభాగాలను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగుల పనితీరు ప్రశంసనీయం అని పేర్కొంటూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా పని చేయాలని సూచించారు. డిపో మేనేజర్, సూపర్వైజర్లను అభినందించారు.ఈ సందర్భంగా డిపో బస్సుల టైమింగ్స్ వివరాలతో రూపొందించిన క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కే. భానుకిరణ్,



డిపో మేనేజర్ ఎస్. స్వాతి, సూపర్వైజర్లు, ఉద్యోగు లు పాల్గొన్నారు. కార్యక్రమం చివర్లో ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

## ఎస్సీ కార్పొరేషన్ పథకాల ఎంపికలో వేగం

* **లింగాలఘణపురం మండలం లో అభ్యర్థుల ఇంటర్వ్యూలు పూర్తి**



జనగామ/ లింగాలఘణపురం,ప్రజాస్ఫూర్తి : ఎస్సీ కార్పొరేషన్ 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబం ధించి మండలంలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వేగం అందుకుం ది. మంగళవారం నిర్వహించిన స్క్రీనింగ్ కమిటీ ఇంటర్వ్యూలలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు. ఎంపీడీఓ ,ఏ.ఈ (ఎలక్ట్రిసిటీ), ఎం.ఏ.ఓ, వెటర్నరీ డాక్టర్, టీజీవీబీ బ్యాంకు మేనేజర్, ఎస్సీ కార్పొరేషన్ అధి కారులతో కూడిన కమిటీ అభ్య ర్థుల అర్హతలను సమగ్రంగా పరిశీలించింది. మండలంలో మొత్తం 161 దరఖాస్తులు అందగా, టూ వీలర్‌కు 25, త్రీ వీలర్‌కు 41, సోలార్ యూని వర్సల్ పంప్‌కు 3, టూ మిల్చ్ ఆనిమల్స్‌కు 92 దరఖాస్తులు నమోదు అయ్యాయి. పరిశీలన అనంతరం మండలానికి 8 టూ వీలర్లు, 3 త్రీ వీలర్ వాహనాలు, ఒక సోలార్ పంప్, 4 టూ మిల్చ్ ఆనిమల్స్ కలిపి మొత్తం 17 యూనిట్లు మంజూరు చేసినట్లు అధికారులు వెల్లడించారు.ఎంపికైన అర్హుల వివరాలను జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు పంపినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారు లు పేర్కొన్నారు.

## మీ సమాచారం ఆధారంగా వార్తాపత్రిక శైలిలో ఇలా రూపొందించాను

* **భూ భారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల పై కలెక్టర్ సమీక్ష**



జనగామ, ప్రజాస్ఫూర్తి : భూ భారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు ఆదేశించారు. మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల స్థితిని పరిశీలించి, పలు కీలక సూచనలు చేశారు. భూ భారతి లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా సవరణ, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితర విభాగాల దరఖాస్తుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తు ల పరిష్కారంలో వేగం పెంచి, కొత్తగా వచ్చే దరఖాస్తులను కూడా తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాదాబైనామా (సింపుల్ సేల్ దీడ్స్ ) కేసులను జాగ్రత్తగా పరిశీలించి, ప్రతి దరఖాస్తును సమగ్రంగా ధృవీకరించాలని పేర్కొన్నారు. భూ సంబంధిత పత్రాలు, పాత రికార్డులు, ఆదాయ వివరాలను ఖచ్చితంగా పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుదారులకు పారదర్శకం గా సమాచారం అందిస్తూ, ఎటు వంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు ఫీల్డ్ స్థాయిలో స్వయంగా పర్యవేక్షణలు నిర్వ హించి నివేదికలు సమర్పించాలని, సమస్యాత్మక కేసులను ఆర్డీఓల ద్వారా జిల్లా స్థాయికి పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## మెగా మెడికల్ హెల్త్ క్యాంప్ కు మంచి స్పందన



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : రామన్నపేట ఏరియాస్పత్రిలో చేనేత కార్మికుల కోసం మెగా మెడికల్ హెల్త్ క్యాంప్" నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రామన్నపేట సర్పంచ్ గరికేపాటి సత్యనారాయణ ప్రారంభించారు.ఈ క్యాంపులో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్ , ఆప్తాల్మాలజీ నిపుణులు పాల్గొన్నారు. వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించబడినవి. శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉన్న వారికి ఛాతీ ఎక్స్‌రేలు తీసినారు. అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయబడినవి. ఈ యొక్క మెడికల్ క్యాంపులో మొత్తం 75 మందికి చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు జెల్లా వెంకటేష్, టౌన్ యూనిట్ అధ్యక్షుడు రాచా యాదగిరి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. స్వేత ప్రియాంక, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డా. సుమన్ కళ్యాణ్, మెడికల్ ఆఫీసర్ డా. అశ్విని కుమార్ , హెచ్ఈఓ గోపాల్, సూపర్వైజర్ వాణిశ్రీ, ఎఎన్ఎంలు , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణపై అదనపు కలెక్టర్ విస్తృత పర్యటన



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణలో సహకార శాఖ, ఐకెపి, గిరిజన కార్పొరేషన్, మెప్మా, తదితర శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, టార్పాలిన్స్, గన్ని సంచులు, మ్యాచ్చర్ మిషన్లు, ప్యాడి క్లీనర్స్, రవాణా చేయుటకు వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని, అన్ని శాఖల సమన్వయంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ కె.అనిల్ కుమార్, సంబంధిత అధికారులను కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు. ప్రభుత్వ సూచనలు,జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, గారి ఆదేశాల మేరకు మంగళవారం మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం, తండ ధర్మారం, అబ్బాయిపాలెం, హేమ దుర్గా రైస్ మిల్లును, దంతాలపల్లి మండలం బిరి శెట్టి గూడెం, పెద్ద వంగర మండలం చిట్యాల గ్రామాలలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు,కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రభుత్వ సూచనల మేరకు ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని, అందుకు సంబంధించి రైతు వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి డబ్బులు త్వరగా పడే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వాతావరణం మార్పుల చేర్పుల నేపథ్యంలో కేంద్రాల వద్ద నిలువ ఉన్న ధాన్యం వర్షంలో తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని వాతావరణ మార్పుల వివరాలను రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలని తెలిపారు,లారీ కాంట్రాక్టర్స్, హమాలీలు,రవాణా చేయు సందర్భంలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా కేంద్రాల నిర్వహణపై అవకతవకలు, అక్రమాలు జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతుల సౌకర్యార్థం ధాన్యం కేంద్రాల నిర్వహణ రవాణా తదితర సందర్భాలలో ఏదైనా సమస్యలు ఏర్పడితే వెంటనే కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నెంబర్ 7995050789 కు సమాచారం అందించాలని కోరారు,అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రమేష్, సివిల్ సప్లై మేనేజర్ నరసింహారావు తహసీల్దారులు కృష్ణవేణి, శ్రీనివాస్, వినోద్, సునీల్ రెడ్డి, సెంటర్ నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

## ప్రజల సమస్యలకు స్పందించిన మున్సిపల్ పాలకవర్గం అధికారులు

* కోతుల సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు.
* మున్సిపాలిటీ చర్యలతో కోతుల బెడద తగ్గింపు ప్రయత్నం



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలోని సాయిబాబా గుడి వెనుక ప్రాంతంలో పెరుగుతున్న కోతుల సమస్యను దృష్టిలో ఉంచుకుని పురపాలక సంఘం ఆధ్వర్యంలో కోతులను పట్టివేత కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని పురపాలక సంఘ చైర్పర్సన్ దండి లక్ష్మి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోతులను సురక్షితంగా పట్టుకునేందుకు ప్రత్యేక బృందం సహకారంతో చర్యలు తీసుకున్నారు.పట్టణంలో కోతుల సమస్యను పూర్తిగా నివారించేందుకు మరిన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్ వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ కౌన్సిలర్లు కొండ రజిత, బత్తుల స్వరూప సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలు

* మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మే 10వ తారీఖు హైదరాబాదు పెరేడ్ గ్రౌండ్ లో ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు భారీ ఎత్తున జన సమీకరణ చేసేందుకు మానుకోట జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు అధ్యక్షతన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ ముఖ్య అతిథిగా విచ్చేసిన సందర్భంగా మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బిజెపి ప్రభుత్వంమేనని, యువకులు, విద్యావంతులు, మేధావులు, రైతులు, ప్రజలందరూ కూడా బిజెపికి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని, దేశం కోసం మోడీ చేస్తున్న అభివృద్ధి పలాలు క్రింది స్థాయి వరకు చేరుతుందని ఈ సందర్భంగా చెప్పడం జరిగింది. కాకతీయులు ఏలిన సామ్రాజ్యంపై కాషాయ జెండా ఎగరేస్తామని ఈ సందర్భంగా చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీరా సీతారాం నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగాల సుధీర్ రెడ్డి, రామచంద్ర రావు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ శ్యాంసుందర్ శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు గడ్డం అశోక్, చీకటి మహేష్, మదన్, ధార ఇందు భారతి, పద్మ, రేష్మ, 26వ వార్డు కౌన్సిలర్ మాలోతు శ్రీదేవి బాలునాయక్, చుక్కా శ్యాంప్రసాద్, అజ్మీర శ్రీకాంత్, శైలజ, పల్లె సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ లో బీజేపీ అధికారం లోకి రావడం ఖాయం

* మెదక్ ఎం.పి రఘునందన్



జనగామ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బిజెపి ) అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నాయకుడు రఘునందన్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెసు ను పూర్తిగా ఖాళీచేయాలనే లక్ష్యం తోనే కేంద్ర నాయకత్వం వ్యూ హాత్మకంగా ముందుకు సాగు తోందని ఆయన పేర్కొన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావే శంలో అయన మాట్లాడుతూ, రాష్ట్రం లో కాంగ్రెస్ నేతలు విఫలమయ్యారని విమర్శించా రు. ప్రజలకు చేసిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయ కత్వం పై ప్రజలకు నమ్మకం పెరిగిందని, అదే విశ్వాసం తో తెలంగాణలో కూడా బీజేపీ జెండా ఎగరవేయాలని ప్రజలు సంకల్పించారని తెలిపారు.రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీ యాల్లో కీలక మార్పులు చోటు చేసుకుంటాయని,బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## జనగణన శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా నేటితో ముగింపు

* జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లాలో జనగణన కార్యక్రమానికి సంబంధించి నాలుగు దఫాలుగా నిర్వహించిన శిక్షణ తరగతులు నేటి తో విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 1,461 మంది ఎన్యుమరేటర్లు మరియు 258 మంది సూపర్వైజర్లుకి సమగ్ర శిక్షణ అందించబడినది. శిక్షణ పొందిన సిబ్బంది అందరూ మే 11 నుండి ప్రారంభమయ్యే గృహ గణన కార్యక్రమంలో పాల్గొననున్నారు.హౌస్ లిస్టింగ్/గృహ గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.అదేవిధంగా, ప్రజలు తమకు అనుకూలంగా ఉంటే మే 10, లోపు స్వీయ గణన పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ విధంగా ముందుగానే స్వీయ గణన పూర్తి చేసుకుంటే, ఎన్యుమరేటర్లు గృహాలకు వచ్చినప్పుడు ప్రక్రియ వేగవంతంగా, సులభంగా పూర్తవుతుందని తెలిపారు. జనగణన వంటి ముఖ్యమైన జాతీయ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా ప్రజలందరూ సహకరించాలని జిల్లా పరిపాలన తరపున విజ్ఞప్తి చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

* ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి
* చర్ల పర్యటనలో జిల్లా కలెక్టర్ అంకిత్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. చర్ల మండలంలో మంగళవారం కలెక్టర్ అంకిత్ విస్తృతంగా పర్యటించారు. దీనిలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించి వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సత్యనారాయణపురం గ్రామంలోని పెద్దపల్లి - ముమ్మిడివరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఇప్పటివరకు వచ్చిన ధాన్యం పరిమాణం, కొనుగోలు ప్రక్రియ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలిస్తూ టార్పాలిన్లు, హమాలీలు, తాగునీరు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాన్ని తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చిన రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సత్యనారాయణపురం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. కాకర్లపూడి విజయలక్ష్మి పూర్తి చేసిన ఇల్లు, చినిగిరి రాజు రూఫ్ స్థాయిలో ఉన్న ఇల్లు, కారం నాగరాజు స్లాబ్ దశలో ఉన్న ఇల్లు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పునాది నుంచి స్లాబ్ వరకు ప్రతి దశలో ఇంజనీరింగ్ ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. సిమెంట్, ఇసుక, ఇనుము వంటి నిర్మాణ సామగ్రి నాణ్యంగా ఉండేలా చూడాలని, పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. గ్రామంలో మంజూరైన 27 ఇళ్లలో 25 ఇళ్లు వివిధ దశల్లో కొనసాగుతుండగా, మిగిలిన ఇళ్లకు గ్రౌండింగ్ వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మౌలిక సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు. మెటర్నిటీ వార్డు, డయాలసిస్ కేంద్రం, మందుల నిల్వ గది, వంటగది, అవుట్ పేషెంట్ విభాగం తదితర విభాగాలను సందర్శించి సేవల నాణ్యతను తనిఖీ చేశారు. ఓపీ విభాగంలో చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుని సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో త్రాగునీటి కొరత ఉన్నట్లు గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి నిరంతర నీటి సరఫరా కల్పించాలని ఆదేశించారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు, శుభ్రత, మౌలిక సదుపాయాలు అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో ఈదయ్య, గృహ నిర్మాణ శాఖ ఏఈ ముకేశ్, ఏఓ లావణ్య, మిషన్ భగీరథ ఏఈలు అరుణ్, రాము, సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సాయి వర్ధన్, డాక్టర్లు రాంప్రసాద్, రవికుమార్, తిరుపతిరావు, జాన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించాలని బీజేపీ ధర్నా



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : మండలంలోని అన్ని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ బీజేపీ వలిగొండ మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల శాఖ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ నాయకత్వం వహించగా జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మిల్లర్లతో కుమ్మక్కై తేమ, తరుగు పేర్లతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. లారీలను అన్‌లోడింగ్ చేయకపోవడంతో వాహనదారులు రైతులపై వెయిటింగ్ ఛార్జీలు వేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఐకేపీ కేంద్రంలో రైతులకు తాగునీటి సదుపాయం, విశ్రాంతి కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని, వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు టార్పాలిన్ కవర్లు అందించాలని అధికారులను డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బందులు కొనసాగితే రాష్ట్రంలోని ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. స్థానిక ఎమ్మెల్యే మండలాన్ని సందర్శించకుండా మీడియా ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని చెప్పడం సరికాదని, ఇప్పటికైనా చొరవ తీసుకుని రైతుల ధాన్యాన్ని వెంటనే తూకం వేయించి అన్‌లోడింగ్ జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, జిల్లా నాయకులు రాచకొండ కృష్ణ, అశోక్ రెడ్డి, తానేష్, రాములు, మంద నరసింహ, శ్రీనివాస్, పద్మారెడ్డి, రామనర్సు, జనార్దన్ రెడ్డి, మండల నాయకులు నాగరాజు, రంజిత్ రెడ్డి, లింగస్వామి గౌడ్, దయాకర్, నరేందర్ రెడ్డి, వెంకటేశం, అనిల్, నరేష్, రామచంద్రం, శ్రీనివాస్, రైతులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు శ్రేణులు సన్నద్ధం కావాలి

* సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పార్టీ శ్రేణులు నిరంతరం సన్నద్ధం కావాలని, పెరుగుతున్న రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడంలో కమ్యూనిస్టుల బాధ్యత మరింత పెరిగిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం పాల్వంచలోని శ్రీ లక్ష్మీ బ్యాంకెట్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి కూనంనేని ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ, దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై కమ్యూనిస్టు కార్యకర్తలు లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. మతోన్మాద శక్తులు బలపడుతున్న తరుణంలో, లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా పార్టీ కేడర్ అప్రమత్తంగా ఉండాలని, ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. కమ్యూనిస్టు నాయకులు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి నమ్మకాన్ని చూరగొనాలని, అప్పుడే బలమైన శక్తిగా ఎదగగలమని ఆయన స్పష్టం చేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా రాజకీయ రిపోర్ట్ ప్రవేశపెట్టారు. నరాటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు సరిరెడ్డి పుల్లారెడ్డి, సారయ్య, సలిగంటి శ్రీను, మున్నా లక్ష్మీకుమారి, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కమటం వెంకటేశ్వర్లు, భాస్కర్, భూక్యా దాసురు, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వ వెంకటేశ్వర్లు, ఫహీం, శంకర్, బంధం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సద్దన్నం తినడం ద్వారా రోగాలు నయమవుతాయి


* డిఎస్పి శివరాం రెడ్డి



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా నల్లగొండలో ప్రారంభమైన మన చద్దన్నం న్యాచురల్ ఫుడ్ స్టాల్ రెండు తెలుగు రాష్ట్రాలలో ఎంతోమందికి ఆరోగ్యాన్ని ఉపాధిని అందిస్తూ విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారంనల్లగొండ పట్టణంలో ఎన్జీ కాలేజీ ముందు ఉన్న మన చద్దన్నం మెయిన్ స్టాల్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలకు అదనపు ఎస్పీ జి రమేష్" హాజరై కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కల్తీ లేని ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తూ, ఇప్పటికి రెండు రాష్ట్రాల్లో 50 స్టాళ్లు ఏర్పాటు చేసి యువతకు ఆదర్శంగా నిలిచి ఎంతో మంది నిరుద్యోగులకు చేయూతనందిస్తూ కృషి చేస్తున్న యాదగిరి సేవలను కొనియాడారు. సద్దన్నం మిల్లెట్స్ ద్వారా ఆహారం తీసుకోవడం వల్ల బిపి షుగర్లు తగ్గుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మన చద్దన్నం వ్యవస్థాపకులు యోగా మాస్టర్,ప్రకృతి విశ్లేషకులు కె.వి. గిరి, కార్పొరేటర్ మల్లికార్జున్, జాతీయ ఉత్తమ ఫోటోగ్రఫీ అవార్డు గ్రహీత జర్నలిస్ట్ కంది భజరంగ్, పుల్లెంల శంకర్, మన చద్దన్నం టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాణిజ్య పంటలు కూడా సాగు చేయాలి

: ఎమ్మెల్యే కునంనేని



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: రైతులు కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగును విస్తరించుకోవాలని ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలంలోని భువన గార్డెన్స్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, రెండవ రోజు 'ఉద్యాన పంటల సాగు'పై నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడుతూ రైతులకు పంటల విభిన్నీకరణ అత్యంత ఆవశ్యకమని, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ ఆటోమేషన్, సిరికల్చర్, ఆయిల్ పామ్ స్టాళ్లను ఆయన పరిశీలించి, ఆధునిక పద్ధతులపై ఆసక్తిగా ఆరా తీశారు. నీటి సంరక్షణ పద్ధతులు పాటించడం వల్ల సాగు ఖర్చు తగ్గి లాభాలు పెరుగుతాయని, వాతావరణ మార్పులను తట్టుకునే పంటలపై అవగాహన కలిగి ఉండాలని రైతులకు హితవు పలికారు. నిపుణులు వివరించిన సాగు మెళకువలను పాటించి రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు. ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపుదల వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు క్షేత్రస్థాయిలో వివరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జె. కిషోర్, ఉద్యాన అధికారి డి. దేవప్రసాద్, హెచ్.ఈ.ఓ వసంత, టిపిసిఎస్ అధ్యక్షులు మండే హనుమంతరావు, ఏఓలు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## జనగ్రహ సభ విజయవంతం చేయాలి

**మెదక్ ఎం.పి రఘునందన్ రావు**

జనగామ,ప్రజాస్ఫూర్తి : 10 వ తేదీన నిర్వహించనున్న జనగ్రహ సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ జనగామకు రానున్న నేపథ్యంలో పార్టీ కార్య కర్తల్లో ఉత్సాహం నెలకొంది. మంగళవారం జిల్లా బీజేపీ కార్యా లయంలో జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవా దాయ శాఖ మంత్రి కొండ సురేఖ హిందూ దేవతల పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తు లో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలు తగిన సమాధానం ఇస్తారని హెచ్చరించారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంస్కరణలు, ఆర్టికల్ 370 రద్దు, రామ మంది రం నిర్మాణం వంటి అంశాలను ప్రస్తావించారు. కేంద్రంలో మూడో సారి అధికారం చేపట్టిన అనంత రం తొలిసారి తెలంగాణకు వస్తున్న ప్రధాని దాదాపు రూ. 7 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రం లో నిర్వహించనున్న ఈ భారీ బహిరం గ సభకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకు లు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షులు, మోర్చా నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలి

*** జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యానవన శాఖల సమన్వయంతో సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు రావాలని, ముఖ్యంగా రైతులకు అధిక ఆదాయం అందించే పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన రైతు వారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. వ్యవసాయం కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే విధంగా ఆధునీకరణ చెందాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఉద్యానవన మరియు వ్యవసాయ శాఖ అధికారులు సమన్వయంతో




పనిచేసి, క్షేత్రస్థాయిలో రైతుల్లో అవగాహన పెంపొందించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం మార్కెట్ లో ఆయిల్ పామ్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సాగు విస్తీర్ణాన్ని భారీగా పెంచాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి, ఇప్పటికే సాగు చేస్తున్న తోటలకు 'ఫీల్డ్ విజిట్' చేయించాలని, తద్వారా సాగు పద్ధతులు, వచ్చే లాభాలపై వారికి ప్రత్యక్ష అవగాహన కల్పించాలని సూచించారు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, లబ్ధిదారుల జాబితాను తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో నీటి వసతి పుష్కలంగా ఉన్న నేపథ్యంలో, కూరగాయల సాగును లాభసాటిగా మార్చాలని కలెక్టర్ పేర్కొన్నారు. కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు, వ్యవసాయ యంత్రీకరణను జోడించి శ్రమను తగ్గించి దిగుబడిని పెంచాలని తెలిపారు.. కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలన్నారు. వరి ఒక్కటే కాకుండా, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని , ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో రైతులతో సమన్వయం చేసుకుంటూ, వారికి అదనపు ఆదాయం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ సాంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి, అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. ఆయిల్ ఫామ్ ఒకసారి నాటితే దాదాపు 25 నుండి 30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయాన్ని ఇస్తుందని తెలిపారు. వరి వంటి పంటలతో పోలిస్తే పెట్టుబడి తక్కువని, కూలీల సమస్య కూడా ఉండదని రైతులకు వివరించారు. రైతులు పండించిన గెలలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్దేశిత కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుందని, అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, దళారీల ప్రమేయం ఉండదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ నాగయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, ప్రోగ్రామ్ ఇంచార్జ్ శ్రీనివాస్, జిల్లా మార్కెట్ అధికారి నాగేశ్వర శర్మ, కెవికె సైంటిస్ట్ నరేష్, తహసిల్దార్ కృష్ణయ్య, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

## పెయింటర్స్ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాస్ఫూర్తి , జన్నారం : జన్నారం మండల పెయింటర్స్ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.అధ్యక్షుడు గా మురిమడుగుల ప్రనిత్,ఉపాధ్యక్షులు గా మహమ్మద్ ఖాన్, అత్తే వెంకటేష్,ప్రధాన కార్యదర్శులుగా దుర్గం మున్నయ్య, జాడి రాజేందర్, కోశాధికారిగా ఉపారావు మధుకర్,ప్రచార కార్యదర్శి గా మంత్రి రాజు, సలహాదారులుగా జాడి లచ్చన్న, సముద్రాల దాసు, దాముఖ ప్రేమ్ సాగర్ లను ఏనుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి, పెయింటర్ల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించింది.ఎన్నికైన కార్యవర్గ సభ్యులను తోటి పెయింటర్లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి , జన్నారం : రైతుల సౌకర్యార్థం జన్నారం మండలం రాంపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కేంద్రం ప్రారంభంతో ఈ ప్రాంత రైతులు తమ పంటను అమ్ముకోవడానికి దూర ప్రాంతాలకు వెళ్లే ఇబ్బంది తప్పుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధరకు రైతుల నుండి నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తామని, తేమ శాతం ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ప్రతి గింజను కొనుగోలు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సాగునీటి పనుల్లో వేగం పెంచాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ మాట్లాడుతూ డోర్నకల్ నియోజకవర్గంలోని ఏడు మండాలాల్లో నీటి పారుదల శాఖలో జరిగే పనుల్లో నిర్ణీత గడువులోగ పూర్తి చేయ్యాలని ఆధికారులను అదేశించారు.మరిపెడ గెస్ట్ హౌజ్ లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో మంజూరైన నిధులను సద్వినియోగం చేస్తూ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ,డీఈ ,ఎఈలు పాల్గొన్నారు.

## 82 గ్యాస్ సిలిండర్ల చోరీ..
## కోహీర్ పట్టణంలో దొంగల హల్‌చల్



కోహీర్, జహీరాబాద్ అర్బన్: సంగారెడ్డి జిల్లా కోహీర్ పట్టణంలో గ్యాస్ సిలిండర్ల దొంగలు హల్‌చల్ చేశారు. సీఐ శివలింగం తెలిపిన వివరాలు.. పట్టణ పరిధి భీంనగర్ కాలనీలోని మనీషా ఇండేన్ గ్యాస్ సిలిండర్ల గోదాం ప్రవేశద్వారం వద్ద దుండగులు సీసీ కెమెరాను ధ్వంసం చేసి లోపలికి చొరబడ్డారు. తలుపులు పగులగొట్టి 82 (51 నిండినవి, 31 ఖాళీవి) సిలిండర్లు ఎత్తుకెళ్లారు. గోదాం తలుపులు తెరిచి ఉండటాన్ని ఉదయం డెలివరీ బాయ్స్ చూసి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. పౌర సరఫరాల శాఖ అధికారులు, స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. ఇద్దరి మృతి




సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బైపాస్ రోడ్డుపై ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. మృతులను చేవెళ్ల వాసులుగా గుర్తించారు. బాధితులంతా తుల్జాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సప్లమెంటరీ క్యాంపులు

**: జిల్లా కలెక్టర్ అంకిత్**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఇంటర్మీడియట్, పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం సప్లమెంటరీ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఈ క్యాంపులు కొనసాగుతాయని చెప్పారు. క్యాంపులలో మౌలిక సదుపాయాలు, ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ చేపడుతున్న పనుల పురోగతిపై కలెక్టర్ మంగళవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారీగా ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థుల వివరాలను సేకరించి, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. భద్రాచలం, పాల్వంచ, చంద్రుగొండలో నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపుల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని సమీక్షించి, ప్రతి విద్యార్థి ఈ క్యాంపులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 13 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను దృష్టిలో




ఉంచుకుని, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఈ తరగతుల ద్వారా విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి హాజరు మరియు అభ్యాస పురోగతిపై అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా పదోతరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం కూడా సమ్మర్ క్యాంపులు నిర్వహించాలని, మండలాలు, పాఠశాలల వారీగా ఫెయిల్ విద్యార్థుల వివరాలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుదీకరణ వంటి మౌలిక వసతులు 100 శాతం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 12 నుండి విద్యాశాఖ ద్వారా చేపట్టబడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి విజయవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధికారులు పాల్గొన్నారు.

## సాగు విధానాలలో విప్లవాత్మక మార్పులు రావాలి

*** ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , ఎమ్మెల్యే కుంభం**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన శాఖల సమన్వయంతో సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు రావాలని, ముఖ్యంగా రైతులకు అధిక ఆదాయం అందించే పంటలపై దృష్టి సారించాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ రోజు భువనగిరి నియోజకవర్గ స్థాయి ఉద్యాన రైతుల సమావేశం నకు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పంటల మార్పిడి మరియు ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా ఆయిల్ ఫామ్ యొక్క ప్రాధాన్యతను రైతులకు సవివరంగా వివరించారు. వరి పంట నుండి రైతులు ఆయిల్ పామ్ మరియు ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపాలని తెలియజేయడం జరిగింది. రైతుల తోటలలో క్షేత్ర స్థాయి పర్యటన చేయించి రైతుల నమ్మకాన్ని కూడగట్టుకుని ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులలో



నుండి నాయకులను తయారు చేసి ఆయిల్ పామ్ సాగును ఒక ఉద్యమం ల ముందుకు తీసుకువెళ్లాలని ఆదేశించారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట యొక్క ప్రాధాన్యతను , ఆయిల్ పామ్ సాగు ద్వారా వంట నూనెల దిగుమతులను తగ్గించుకోవడం ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసుకోవచ్చు అని, తద్వారా రైతులకు లాభాలు చేకూరుతాయని వివరించడం జరిగింది. ఉద్యాన పంటల సాగుతో ఒక రూపాయి పెట్టుబడికి 3 రూపాయల ఆదాయం వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు 7% మాత్రమే అయినప్పటికీ దేశ జీడీపీ కి ఉద్యాన పంటల ఉత్పత్తులు 25% సమకూరుస్తున్నాయని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ మరియు ఉద్యాన పంటలు సాగుకు మంచి భవిష్యత్తు ఉందని ఈ పంటల సాగు ద్వారా రైతులు ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉద్యాన , పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి మాధవి మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో గత సంవత్సరం సాధించిన ఉద్యాన ప్రగతిని , ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన వివిధ రకాల ఉద్యాన పథకాలను వాటి యొక్క రాయితీలను రైతులందరికీ తెలియజేశారు. కొంతమంది ఆదర్శ రైతులు వారి యొక్క అనుభవాలను ఉద్యాన పంటల సాగు వివరాలను ఇతర రైతులకు తెలియజేసి ఉద్యాన పంటల వైపు మళ్లించేలా ప్రోత్సహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి మురళి, జిల్లా మార్కెటింగ్ అధికారి , జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ చిస్తీ, భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, అగ్రికల్చర్ ఏడీఏలు ఉద్యాన అధికారులు వ్యవసాయ అధికారులు ఆయిల్ ఫెడ్ సిబ్బంది మైక్రో ఇరిగేషన్ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## బ్యాంకులు,గోల్డ్ లోన్ ఫైనాన్స్, జ్యూవలరీ షాప్ యజమానులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

*** మహబూబాబాద్ టౌన్ ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ ఎన్ అంజలి.**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కరీంనగర్ లో జరిగిన జ్యూవలరీ షాప్ దోపిడీని దృష్టిలో ఉంచుకుని మహబూబాబాద్ టౌన్ లోని బ్యాంకులు, గోల్డ్ లోన్ ఫైనాన్స్ సంస్థలు, జ్యూవలరీ షాప్ యజమానులతో మహబూబాబాద్ టౌన్ ఇంచార్జ్ సీఐ అంజలి మీటింగ్ ఏర్పాటుచేసి వారి సంస్థల్లో, వ్యాపార సముదాయల్లో భద్రతా ప్రమాణాలను పెంచాలని సూచించారు. ముఖ్యంగా *సెక్యూరిటీ అలారం వ్యవస్థలు*అన్ని గోల్డ్ లోన్ ఫైనాన్స్ ఆఫీసుల్లో, స్ట్రాంగ్ రూమ్ లలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన సెక్యూరిటీ అలారాలు, మోషన్ సెన్సార్లు సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. హెచ్చరిక అలారాలు ఏవైనా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే లేదా లాకర్ రూమ్




ను తెరిచినప్పుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు కనెక్ట్ అయ్యే సైరన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి."సిబ్బంది పర్యవేక్షణ *గోల్డ్ మదింపుదారులు ఫైనాన్స్ మేనేజర్లు సిసిటివి నిఘాలో ఉండాలి.బంగారం మదింపు ప్రక్రియను కస్టమర్ల సమక్షంలోనే చేయాలి.కేవైసీ నియమాలు బంగారం తాకట్టు పెట్టే ముందు కస్టమర్ వివరాలను, వారి ఆధార్ కార్డు, పాన్ కార్డు, మరియు బంగారు కొనుగోలు బిల్లులను కచ్చితంగా తనిఖీ చేయాలి.స్టోరేజ్ భద్రత* తాకట్టు పెట్టిన బంగారాన్ని సురక్షితమైన లాకర్లలో భద్రపరచాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ టౌన్ ఎస్ఐలు రామ్ చరణ్, షాకీర్ లు, బ్యాంకు, ఫైనాన్స్ సంస్థల మేనేజర్లు, జ్యూవలరీ షాప్ యజమానులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన.. ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష



హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనకు అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సీఎస్ రామకృష్ణారావు ఆదేశించారు. ఈనెల 10న హైదరాబాద్ రానున్న ప్రధాని మోదీ .. పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, బహిరంగ సభలో పాల్గొననున్నారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సీఎస్ రామకృష్ణారావు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటనకు తగిన భద్రత, ట్రాఫిక్, అగ్నిమాపక, వైద్య సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని.. పోలీసు, ఫైర్, వైద్యారోగ్య శాఖలకు సీఎస్ సూచించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాల్లో రోడ్లను పరిశీలించాలని, ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి, ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడాలని సీఎస్ తెలిపారు. సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్ రాజ్, నవీన్ మిత్తల్, దానకిషోర్, వాణిప్రసాద్, శిఖా గోయల్, అనిల్ కుమార్, సీపీ సజ్జనార్, ఆర్.వి.కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## నెమళ్లు, జింకలను వేటాడిన ఆరుగురు సభ్యుల ముఠా అరెస్ట్



హైదరాబాద్: షాద్‌నగర్, మక్తల్ అటవీ ప్రాంతాల్లో జంతువులను వేటాడి, వాటి మాంసం తింటున్న ఆరుగురు సభ్యుల ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నాలుగు ఎయిర్ గన్‌లు, రైఫిల్, 20 తూటాలు, కారు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో నలుగురు హైదరాబాద్‌కు చెందిన వారు కాగా, ఒకరు నారాయణ్‌పేట, మరొకరు జడ్చర్లకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. వీరిలో ప్రధాన నిందితుడు మహ్మద్ ముజాఫర్ హుస్సేన్.. ఈ ముఠాను ఏర్పాటు చేసినట్టు దర్యాప్తులో తేలింది. వీరంతా జింకలు, నెమళ్లు, కుందేళ్లు, పావురాలను వేటాడుతున్నట్టు గుర్తించారు. జంతువులను వేటాడుతున్న సమయంలో నిందితులు తీసుకున్న వీడియోలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఎప్పటి నుంచి జంతువులను వేటాడుతున్నారనే వివరాలను సేకరిస్తున్నారు.

## ఆటో డ్రైవర్ సాహసం..
## అభినందించిన సీపీ సజ్జనార్




హైదరాబాద్: ఓ ఆటో డ్రైవర్ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా చూపిన తెగువను హైదరాబాద్ సీపీ సజ్జనార్ మెచ్చుకున్నారు. మహిళ మెడలో నుంచి బంగారం గొలుసు లాక్కుని పరారయ్యేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్‌ను ఆటో డ్రైవర్ పట్టుకుని సాహసం ప్రదర్శించాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బేగంబజార్ జిన్సీ చౌరాహా ప్రాంతంలో ఓ మహిళ తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. డబీర్‌పురాకు చెందిన రౌడీషీటర్ మహ్మద్ సోహేల్.. ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో దొంగ స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జహీర్ గమనించారు. వెంటనే ఆటో వెనక్కి తిప్పి.. వాహనంపై నుంచి లేచి పరారయ్యేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్‌ను తన ఆటోతో ఢీకొట్టాడు. నిందితుడు ఆటో డ్రైవర్‌పై కత్రతో దాడికి దిగాడు. అయినా లెక్క చేయకుండా ఆటో డ్రైవర్.. రౌడీషీటర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు నమోదయ్యాయి. సీపీ సజ్జనార్ ఆటో డ్రైవర్ జహీర్‌ను సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.

# ప్రధాని మోదీ, రాహుల్ గాంధీకి విజయ్ థాంక్స్

తమిళనాడు ప్రజల శ్రేయస్సే తమ ఏకైక లక్ష్యమని టీవీకే చీఫ్ విజయ్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుత ఫలితాలు సాధించిన అనంతరం ఆయన తొలిసారి 'ఎక్స్' వేదికగా స్పందించారు. తమ పార్టీ విజయాన్ని అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ (PM Modi), లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ(Rahul Gandhi)కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ వేర్వేరుగా పోస్టులు పెట్టారు. ప్రజల శ్రేయస్సే తమ ఏకైక లక్ష్యమన్న విజయ్.. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రగతి, తమిళనాడు ప్రజల సంక్షేమంపై దృష్టిసారిస్తామని తెలిపారు. ఈ కృషిలో కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఈ సందర్భంగా ప్రధానిని కోరారు. అలాగే, నిన్న తనకు కాల్ చేసి శుభాకాంక్షలు చెప్పిన రాహుల్‌గాంధీకి విజయ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాసేవలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించేందుకు సమష్టి సహకారం ద్వారా రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించేందుకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజా సంక్షేమానికే అధిక ప్రాధాన్యమిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.





# ప్రీతి జింటాను కలిసేందుకు.. 80 కి.మీ. పరిగెత్తి!

లుధియానా: బాలీవుడ్ నటి ప్రీతి జింటాను కలవాలనే కలను నెరవేర్చుకునేందుకు ఓ బాలుడు ఏకంగా 80 కిలోమీటర్ల మేర పరిగెత్తాడట. పంజాబ్‌లోని లుధియానా జిల్లా ఖన్నాకు చెందిన అమరిందర్ సింగ్ (17)కు పరుగంటే ప్రాణం. చిన్నప్పటి నుంచే రన్నింగ్ చేసేవాడు. ఇటీవల మొహాలీలో ఐపీఎల్ మ్యాచ్ ఉందని తెలుసుకున్నాడు. మ్యాచ్ చూడటంతోపాటు పంజాబ్ ఫ్రాంచైజీ సహ యజమాని ప్రీతి జింటాను కలవాలనే లక్ష్యంతో.. ఇంటి నుంచి పరుగు మొదలుపెట్టాడు. అలసట, ఎండ వంటి అడ్డంకులు ఎదురైనప్పటికీ..దాదాపు 80 కి.మీ. మేర పరిగెత్తాడు. చివరకు స్టేడియానికి చేరుకున్నప్పటికీ.. టికెట్ లేకపోవడంతో లోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అయితే.. బాలుడి పట్టుదలను గమనించి, సోషల్ మీడియాలో అతడి గురించి అప్పటికే తెలిసి ఉండటంతో పోలీసులు అనుమతించారు. "స్టేడియంలోకి వెళ్లిన అనంతరం ప్రీతి జింటాను కలిశాను. నా ప్రయాణం గురించి తెలుసుకుని ఆమె అభినందించారు. ఐపీఎల్ టీమ్ టీషర్ట్‌ను బహుమతిగా ఇచ్చారు. ప్రముఖ పంజాబీ కళాకారులు గురుదాస్ మాన్, అమ్మీ విర్క్, సునంద శర్మ వంటివారినీ కలిశాను. వారు నన్నెంతో ప్రోత్సహించారు" అని అమరిందర్ తెలిపాడు.

# నేను రాజీనామా చేయను: మమతా బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో తాము భాజపాతో పోరాడలేదని.. ఆ పార్టీ కోసం పనిచేసిన ఎన్నికల సంఘంతో పోరాడామని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఇలాంటి ఎన్నికలను ఎప్పుడూ చూడలేదన్నారు. తాను సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజాతీర్పు వల్ల కాదని.. కుట్ర కారణంగానే తాము ఓడిపోయామన్నారు. ఫలితాల అనంతరం.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ తదితర నేతలు తనకు ఫోన్ చేసి సంఘీభావం తెలిపారన్నారు. ఇకపై 'ఇండియా' కూటమి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. "ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ.. ఈవీఎంలను తారుమారు చేస్తూ.. సీఈసీ ఓ విలన్‌గా మారారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా ఈవీఎంలలో 80-



90 శాతం ఛార్జ్ ఉంటుందా? అదెలా సాధ్యం? ఎన్నికలకు రెండు రోజుల ముందు.. మా పార్టీ శ్రేణులను అరెస్టు చేయడం మొదలుపెట్టారు. అన్నిచోట్లా సోదాలు నిర్వహించారు. ఐపీఎస్, ఐఏఎస్ అధికారులందరినీ మార్చేశారు. ఎన్నికల సంఘంతో కలిసి భాజపా గేమ్ ఆడింది. మేం అన్ని యంత్రాంగాలకు వ్యతిరేకంగా పోరాడాం. ఎస్ఐఆర్ పేరిట 90 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. మేం కోర్టుకు వెళ్తే.. 32 లక్షల పేర్లను చేర్చారు. ఓట్ల లెక్కింపులో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయి. దాదాపు 100 స్థానాల్లో మా గెలుపును కాజేశారు. టీఎంసీ మనోధైర్యాన్ని దెబ్బతీయడానికి లెక్కింపు ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా నెమ్మదిగా చేపట్టారు. చరిత్రలో ఇదొక చీకటి అధ్యాయం. ఎన్నికల అనంతర హింసతో ప్రభావితమైన ప్రాంతాలను సందర్శించి.. క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేసేందుకు 10 మంది సభ్యులతో కూడిన నిజనిర్ధరణ కమిటీని ఏర్పాటు చేస్తున్నాం" అని మీడియా సమావేశంలో మమతా బెనర్జీ తెలిపారు. 2021లో ఎన్నికల అనంతరం హింస జరిగిందన్న ఆరోపణలను ఆమె నిరాధారమైనవిగా కొట్టిపారేశారు.

# ఎన్నో సమస్యలు ఉండగా. ఈ పిల్ ఎందుకు వేశారు..?సుప్రీం ఆగ్రహం


శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశ హక్కును కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన లాయర్స్ అసోసియేషన్‌పై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. అసలు పిటిషన్ ఎందుకు దాఖలు చేశారని ప్రశ్నించింది. 1990లో కేరళ హైకోర్టులో తంత్రి (ప్రధాన పూజారి) అఫిడవిట్ దాఖలు చేసినట్లు వెల్లడించిన పలు పత్రికా కథనాల ద్వారా ఈ పిల్ వేసినట్లు పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. దీంతో జస్టిస్ నాగరత్న దేశంలో ఎన్నో



సమస్యలు ఉండగా.. పిటిషనర్ ఈ విషయంపైనే ఎందుకు అంత ఆసక్తి చూపుతున్నారని ప్రశ్నించారు. అసలు శబరిమల ఆలయంతో మీకేం సంబంధముందని పిటిషనర్‌ను ప్రశ్నించారు. లాయర్స్ అసోసియేషన్.. బార్ సంక్షేమం, దేశం కోసం పని చేయకుండా ఇటువంటి విషయాలపై ఎందుకు ఉత్సుకత చూపుతోందన్నారు. దీనికంటే న్యాయం కోసం గ్రామాల నుంచి వచ్చే పేదల కోసం పని చేయాలని వారికి సూచించారు. పత్రికా కథనాల ఆధారంగా దాఖలు చేసిన పిటిషన్‌లను ముందే కొట్టివేయాల్సిందని.. దీనిపై విచారణ జరపడం సరికాదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఇటువంటి కేసులు పెట్టి కోర్టును ఇబ్బంది పెట్టొద్దని..ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని పిటిషనర్‌ను ధర్మాసనం హెచ్చరించింది.

# విజయ్ మా మద్దతు కోరారు: కాంగ్రెస్


తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ మార్కును (118 సీట్లను) సాధించలేకపోయింది. ఇందుకు మరో 10 మంది సభ్యుల మద్దతు అవసరం. ఈ క్రమంలోనే విజయ్ తమ పార్టీ మద్దతు కోరినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ వెల్లడించారు.



విజయ్ అభ్యర్థనపై తుది నిర్ణయం తీసుకోవాల్సిందిగా టీఎన్‌సీసీని పార్టీ అధిష్ఠానం ఆదేశించిందన్నారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవాలని సూచించిందన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి నుంచి పోటీ చేసిన కాంగ్రెస్.. ఐదు చోట్ల విజయం సాధించిన విషయం తెలిసిందే.

# ఖతార్ గగనతలంలో అమెరికా 'గ్యాస్ స్టేషన్' మిస్సింగ్..!

పశ్చిమాసియా ఘర్షణల వేళ అమెరికాకు మరో ఎదురుదెబ్బ తగిలినట్లు కనిపిస్తోంది. ఆ దేశ మిలిటరీ విమానాలకు ఎగిరే గ్యాస్ స్టేషన్‌గా పనిచేసే బోయింగ్ KC135 స్ట్రాటోట్యాంకర్ ఖతార్ గగనతలంలో రాడార్‌తో సంబంధాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అల్ దఫ్రా ఎయిర్‌బేస్ నుంచి టేకాఫ్ అయిన ఈ ట్యాంకర్ పర్షియన్ గల్ఫ్ మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు ఎమర్జెన్సీ సిగ్నల్ పంపినట్లు ఇరాన్ మీడియా సంస్థ పేర్కొంది. అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వచ్చినప్పుడే అలాంటి కోడ్‌ను ప్రసారం చేస్తారని పేర్కొంది. పశ్చిమాసియా ఘర్షణల నేపథ్యంలో అక్కడ మోహరించిన విమానాలకు అవసరమైన ఇంధనాన్ని సరఫరా చేసేందుకు ఈ ట్యాంకర్‌ను అమెరికా సైన్యం ఉపయోగిస్తోంది. దీనివల్ల ఫైటర్ జెట్స్, బాంబర్లు, ఇతర సైనిక విమానాలు ఎక్కువ




గంటలు ప్రయాణించేందుకు వీలు కలుగుతుంది. తాజాగా ఈ విమానం అత్యవసర ల్యాండింగ్‌కు యత్నిస్తోన్న సమయంలో కొద్దిసేపు గుండ్రంగా తిరిగినట్లు ఫ్లైట్‌రాడార్24 డేటాలో కనిపించింది. అయితే అది ఎందుకు అత్యవసరంగా ల్యాండ్ కావాల్సి వచ్చిందో మాత్రం తెలియరాలేదు. అలాగే ఇరాన్‌అమెరికా ఉద్రికత్తలకు దీనికి ఏమైనా సంబంధం ఉందా..? అనేది కూడా స్పష్టత లేదు. తమ ప్రమేయంపై ఇరాన్ ఎలాంటి ప్రకటనా చేయలేదు.

# తెలంగాణ విద్యా రంగంలో AI విప్లవం రఘురామ్ రాజన్‌తో CM రేవంత్ కీలక భేటీ

ప్రాథమిక, ఉన్నత పాఠశాల, సాంకేతిక విద్యతో పాటు వైద్య విద్య సిలబస్ లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (AI) వినియోగం, దాని ఉపయోగంపైన ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తామని, ఈ విషయంలో తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌ని కోరారు. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రఘురామ్ రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఏఐ వినియోగంతో పాటు మిడిల్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వివరించారు. సరైన పద్ధతిలో ఏఐని వినియోగిస్తే అందరికి మేలు జరుగుతుందని రాజన్ చెప్పారు. తమిళనాడు తరహాలో పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చునని తెలిపారు. డేటా సెంటర్స్ కోసం పెద్ద ఎత్తున విద్యుత్, నీటి వినియోగం ఉంటుందని చెప్పారు. మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు వస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

**సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి..**

నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని రఘురామ్ రాజన్ వివరించారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్యను తగ్గించుకోవాలంటూ పలు సూచనలు చేశారు. ప్రభుత్వాలు అనుసరించే సులభతర వ్యాపార విధానాలపై ఆధారపడి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని చెప్పారు. స్టార్టప్ లను ఎక్కువ ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశ్రమల



కోసం కావాల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. కావాల్సిన భూమితో పాటు మౌలిక సదుపాయాలు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్ రింగ్ రోడ్డుతో పాటు అనేక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి పైన దృష్టిసారించినట్లు తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ ధానంలో ముందుకు వెళ్తున్నట్లు ఆయన వివరించారు. రాష్ట్రా అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారన్నారు. తెలంగాణ పారిశ్రామికాభివృద్ధి కోసం తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని రఘురామ్ రాజన్‌ని కోరారు.

**అనుకూల పరిస్థితులు..**

సులభతర వ్యాపారానికి తెలంగాణలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వివరించారు. ఫార్మా , ఐటీ, డేటా సెంటర్ల కోసం కావాల్సిన మంచి వాతావరణం, వసతులు కల్పిస్తున్నట్లు రఘురామ్ రాజన్‌కి వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ పాల్గొన్నారు.

# MSME, విమాన సంస్థల కోసం క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్

దిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ సవాళ్లు ఎదుర్కొంటున్న ఎంఎస్‌ఎంఈ, విమానయాన సంస్థలు, ఇతర కంపెనీలకు కేంద్రం ఊరట కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా సంస్థలు మూలధన అవసరాలను తీర్చడంలో సాయపడేందుకు రూ.18,100 కోట్లతో అత్యవసర రుణ హామీ పథకాన్ని (ECLGS) ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ మంగళవారం



ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ఈ పథకం వల్ల మొత్తం రూ.2.55 లక్షల కోట్ల అదనపు రుణ ప్రవాహం లభిస్తుందని అంచనా వేస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం వల్ల ప్రభావితమైన విమానయాన సంస్థలతో పాటు ఎంఎస్‌ఎంఈలను ఆదుకోవడానికి ఈ పథకాన్ని తీసుకొచ్చామన్నారు. ఆయా వ్యాపారాలను నిలబెట్టడంతో పాటు, ఉద్యోగాలు కోల్పోకుండా నివారిస్తుందన్నారు. సప్లయ్ చైన్ అవరోధాలనూ నివారించడానికి ఈ పథకం దోహదపడుతుందని తెలిపారు.

**సుప్రీం జడ్జిల సంఖ్య పెంపు:** సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం 33గా ఉన్న సుప్రీం కోర్టు న్యాయమూర్తుల సంఖ్యను (ప్రధాన న్యాయమూర్తి మినహా) 37కు పెంచేందుకు బిల్లు తీసుకురానున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు.

# అరుదైన వైరస్ కలకలం.. సముద్రంలో నిలిచిన నౌక

ఒక క్రూజ్ నౌకలో అరుదైన వైరస్ కలకలం సృష్టిస్తోంది. దాంతో అందులో ఉన్న ప్రయాణికులు సముద్రంలో సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. వారంతా అట్లాంటిక్ మహాసముద్రంలో కేప్ వెర్డే తీరానికి సమీపంలో వేచిఉన్నారు. ఇప్పటికే ముగ్గురు ప్రయాణికులు మృతి చెందడం.. మరో ముగ్గురు తీవ్ర అనారోగ్యానికి గురవడంతో వారు ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, షిప్ ఆపరేటర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎంవీ హౌండియస్ (డచ్‌షిప్) దాదాపు 150 మంది ప్రయాణికులతో అర్జెంటీనా నుంచి బయల్దేరింది. వాస్తవంగా అంటార్కిటికా, అట్లాంటిక్ మహా సముద్రంలో వారం రోజుల పాటు ఈ యాత్ర కొనసాగాల్సి ఉంది. అయితే అంతలోనే వైరస్ వ్యాప్తి చెందడంతో కేప్ వెర్డే తీరంలోకి వచ్చిన తర్వాత సహాయం కోసం నౌక నుంచి స్థానిక అధికారులకు అభ్యర్థన వెళ్లింది. అయితే అందులోని వారు దిగేందుకు అనుమతి లభించలేదు. ప్రజారోగ్య ఆందోళనల దృష్ట్యా తమ రేవులో ఆ నౌకను నిలిపేందుకు ప్రస్తుతానికి అనుమతివ్వలేదని కేప్ వెర్డే ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. తమ తీరానికి దూరంగా సముద్ర జలాల్లో అది నిలిచిఉందని పేర్కొంది. నౌకలోని ప్రస్తుత పరిస్థితికి అరుదైన హంటా వైరస్ కారణమని అనుమానిస్తున్నారు. ఇది ఎలుకల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

# దక్షిణ భారత లగ్జరీ మార్కెట్‌లో హైదరాబాద్ హవా..

**ఇళ్ల అమ్మకాల్లో అగ్రస్థానం!**

**దక్షిణ భారత అల్ట్రా-లగ్జరీ గృహాల మార్కెట్‌లో హైదరాబాద్ అగ్రస్థానం**

**ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 8,562 కోట్ల విలువైన విలాస గృహాల అమ్మకాలు**

**బెంగళూరు, చెన్నైల కంటే హైదరాబాద్‌లోనే అత్యధిక అమ్మకాలు**

**ఇండియా సొత్‌బీస్, క్రె మ్యాట్రిక్స్ సంయుక్త నివేదికలో వెల్లడి**



**న్యూఢిల్లీ:** దక్షిణ భారతదేశంలో అల్ట్రా-లగ్జరీ గృహాల మార్కెట్‌లో హైదరాబాద్ నగరం తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 2026 ఆర్థిక సంవత్సరంలో రూ. 10 కోట్లకు పైగా విలువైన ఇళ్ల అమ్మకాల్లో భాగ్యనగరం అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాదిలో మొత్తం రూ. 8,562 కోట్ల విలువైన విలాసవంతమైన గృహాలు ఇక్కడ అమ్ముడయ్యాయి. ఈ వివరాలను ఇండియా సొత్‌బీస్ ఇంటర్నేషనల్ రియల్టీ, క్రె మ్యాట్రిక్స్ సంస్థలు మే 5న విడుదల చేసిన సంయుక్త నివేదికలో వెల్లడించాయి.

ఈ నివేదిక ప్రకారం, దక్షిణాదిలోని మూడు ప్రధాన నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలో కలిపి ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 11,246 కోట్ల విలువైన 811 అల్ట్రా-లగ్జరీ యూనిట్లు అమ్ముడయ్యాయి. ఇందులో హైదరాబాద్ వాటానే సింహభాగం. నగరంలో అత్యధికంగా 625 యూనిట్లు (రూ. 8,562 కోట్లు) విక్రయం కాగా, బెంగళూరులో 128 యూనిట్లు (రూ. 1,957 కోట్లు), చెన్నైలో 58 యూనిట్లు (రూ. 727 కోట్లు) అమ్ముడయ్యాయి. నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌లో ఈ అమ్మకాల విలువ రూ. 2,447 కోట్లుగా ఉండగా, ఇప్పుడు మూడు రెట్లకు పైగా పెరగడం విశేషం.

హైదరాబాద్‌లో విశాలమైన ఇళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉన్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. అమ్ముడైన యూనిట్లలో సగానికి పైగా 8,000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న అపార్ట్‌మెంట్లే కావడం గమనార్హం. మొత్తం లావాదేవీల విలువలో విల్లాలు, రో-హౌస్‌ల వాటా 40 శాతంగా ఉంది. ముఖ్యంగా కోకాపేట ప్రాంతం ఈ అమ్మకాల్లో హాట్‌స్పాట్‌గా నిలిచింది.

## హర్మూజ్ జలసంధిలో ఘర్షణలు..

**బేర్‌మన్న మార్కెట్లు**


**పశ్చిమాసియా ఉద్రిక్తతలతో నష్టాల్లో ముగిసిన సూచీలు**

**251 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 86 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**భారీగా నష్టపోయిన బ్యాంకింగ్, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు**

**డాలర్‌తో పోలిస్తే 95.30 స్థాయికి పడిపోయిన రూపాయి విలువ**

**నిలదొక్కుకున్న ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లు**



**ముంబై:** పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు దేశీయ స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపడంతో సూచీలు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 251.61 పాయింట్లు నష్టపోయి 77,017.79 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 86.50 పాయింట్లు తగ్గి 24,032.80 వద్ద ముగిసింది. సోమవారం నాటి లాభాలను సూచీలు పూర్తిగా కోల్పోయాయి. ట్రేడింగ్ సెషన్‌లో బ్యాంకింగ్, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. ప్రపంచ వృద్ధిపై ఆందోళనలు, ఇంధన మార్కెట్లలో అనిశ్చితి దీనికి కారణంగా నిలిచాయి. అయితే, ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లు కొంత మేర నిలదొక్కుకుని మార్కెట్లకు స్వల్ప మద్దతునిచ్చాయి. బ్రాడర్ మార్కెట్లలో మాత్రం మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.17 శాతం, స్మాల్‌క్యాప్ 0.28 శాతం లాభాలతో ముగియడం గమనార్హం.

పశ్చిమాసియాలోని హర్మూజ్ జలసంధి సమీపంలో అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఘర్షణలు చెలరేగినట్లు వచ్చిన వార్తలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. నెల రోజులుగా ఉన్న కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో, ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన ఈ ప్రాంతంలో అస్థిరత కొనసాగుతుందనే భయాలు పెరిగాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల పైకి చేరడంతో రూపాయి విలువ పతనమైంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.30 స్థాయికి బలహీనపడింది. "భవిష్యత్తులో మార్కెట్ల గమనం భౌగోళిక రాజకీయ పరిణామాలు, వెలువడనున్న కంపెనీల త్రైమాసిక ఫలితాలపై ఆధారపడి ఉంటుంది" అని ఓ మార్కెట్ నిపుణుడు పేర్కొన్నారు. ఈ వారం వెలువడే అమెరికా నాన్-ఫామ్ పేరోల్స్, నిరుద్యోగ గణాంకాల కోసం మార్కెట్లు ఎదురుచూస్తున్నాయని విశ్లేషకులు తెలిపారు.

## ఇక సైన్యంలోనూ 'థార్' సేవలు..

**పవర్‌ఫుల్ ఫీచర్లతో 'మహీంద్రా ఏటీవీ'**

**భారత సైన్యం కోసం మహీంద్రా థార్ ప్రత్యేక వెర్షన్ ఆవిష్కరణ**

**'మహీంద్రా ఏటీవీ' పేరుతో సరికొత్త టాక్టికల్ వాహనాన్ని పరిచయం చేసిన మహీంద్రా డిఫెన్స్**



**న్యూఢిల్లీ:** భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో మహీంద్రా థార్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఆఫ్-రోడింగ్ ప్రియుల నుంచి మంచి రోడ్ ప్రెజెన్స్ కోరుకునే వారి వరకు ఎందరో ఈ వాహనాన్ని ఇష్టపడతారు. అయితే, ఎప్పటినుంచో థార్ అభిమానుల మదిలో ఒక కోరిక ఉండేది. తమ అభిమాన వాహనాన్ని భారత సైన్యంలో ఒక టాక్టికల్ వాహనంగా చూడాలని వారు ఆశపడేవారు. ఎట్టకేలకు వారి కల నిజమైంది. మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా స్వయంగా ఈ శుభవార్తను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. మహీంద్రా డిఫెన్స్ విభాగం 'రక్షా త్రివేణి సంగమం'లో ప్రదర్శించిన 'మహీంద్రా ఏటీవీ' (ఆల్-టెర్రెయిన్ వెహికల్) చిత్రాలను ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. థార్ రాక్స్ ప్లాట్‌ఫామ్‌పై ఆధారపడి, బెంగళూరుకు చెందిన 'ప్రాడ్ 4ఇ4' సంస్థ సహకారంతో ఈ వాహనాన్ని అత్యంత పటిష్ఠంగా అభివృద్ధి చేశారు.

ఈ వాహనం గురించి ఆనంద్ మహీంద్రా తన పోస్ట్‌లో అద్భుతంగా వివరించారు. "మీ ముందున్నది మహీంద్రా ఏటీవీ. ఇందులో అనవసరమైన అలంకరణలు, హంగులు ఏవీ లేవు. కేవలం దాని సామర్థ్యంపైనే దృష్టి సారించాం. ఇందులో అమర్చిన ప్రతి బార్‌కు, ప్రతి మౌంట్‌కు ఒక నిర్దిష్టమైన పని ఉంది. ఇది మా సంస్థ డీఎన్ఏకు ప్రతిరూపం. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తట్టుకుని నిలబడటం, ఎక్కడికైనా వెళ్లగలగడం, పరిస్థితులకు అనుగుణంగా మారగలగడం వంటి లక్షణాలే మా ప్రతి వాహనానికి గుండెకాయ. ఈ ఏటీవీని మన భద్రతా దళాల కోసం ప్రత్యేకంగా నిర్మించాం. వారికి సేవ చేసే అవకాశం దొరికినందుకు గర్విస్తున్నాం" అని పేర్కొన్నారు.

# సంజూ శాంసన్ విధ్వంసం..

**ఢిల్లీపై చెన్నై సూపర్ కింగ్స్ ఘన విజయం**

**ఢిల్లీ క్యాపిటల్స్‌పై 8 వికెట్ల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్ ఘన విజయం**

**విధ్వంసక బ్యాటింగ్‌తో చెలరేగిన సంజూ శాంసన్ (87 నాటౌట్)**

**156 పరుగుల లక్ష్యాన్ని 17.3 ఓవర్లలోనే ఛేదించిన చెన్నై**

**మూడో వికెట్‌కు 114 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పిన శాంసన్, కార్తీక్ శర్మ**

**ఢిల్లీ జట్టులో పోరాడిన సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్**



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ మరో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సంజూ శాంసన్ (87లి నాటౌట్; 52 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసక ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో, ఢిల్లీ నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని చెన్నై 17.3 ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. చెన్నై బౌలర్ల క్రమశిక్షణతో కూడిన బౌలింగ్ ముందు ఢిల్లీ టాపార్డర్ తడబడింది. అయితే, చివర్లో ట్రిస్టన్ స్టబ్స్ (38), సమీర్ రిజ్వీ (40 నాటౌట్) పోరాడటంతో ఢిల్లీ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం 156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నైకి ఆరంభంలోనే షాక్ తగిలింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (6), ఉర్విల్ పటేల్ (17) త్వరగా పెవిలియన్ చేరారు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సంజూ శాంసన్, కార్తీక్ శర్మ (41లి నాటౌట్; 31 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి అద్భుతమైన భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 114 పరుగులు జోడించి జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు. శాంసన్ తన మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు.

## పంత్‌పై కెప్టెన్సీ భారం..

**స్వేచ్ఛగా ఆడనిస్తేనే లక్నోకు మంచిది..!**



**లక్నో:** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ నాయకుడిగా, ఆటగాడిగా రిషభ్ పంత్ విఫలమవుతున్నాడు. కెప్టెన్సీ భారం వల్లనే పంత్ తన సహజ స్టయిల్లో ఆడలేకపోతున్నాడని మాజీలు అంటున్నారు. ముంబై ఇండియన్స్‌పై పంత్ సారథిగా తేలిపోయాడని కామెంటేటర్ షాన్ పొలాక్ మండిపడ్డాడు. ఈ నేపథ్యంలో పంత్‌ను కెప్టెన్‌గా తప్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. మాజీ ఆటగాళ్లు మనోజ్ తివారీ, రోహన్ గవాస్కర్‌లు అతడిని సారథిగా తప్పించాలని లక్నో యాజమాన్యానికి సలహా ఇచ్చారు.

పద్దెనిమిదో సీజన్ మెగా వేలంలో రూ.27.25 కోట్ల రికార్డు ధరకు లక్నో గూటికి చేరిన పంత్ స్థాయికి తగ్గట్టు ఆడడం లేదు. కెప్టెన్‌గానూ దారుణంగా విఫలమవతున్నాడీ టీమిండియా స్టార్. అతడి సారథ్యంలో ఎల్ఎస్‌జీ 23 మ్యాచుల్లో కేవలం ఎనిమిదింటిలోనే గెలుపొందింది. పంతొమ్మిదో సీజన్‌లో లక్నో అట్టడుగున నిలవడంలో పంత్ వైఫల్యాన్ని కొట్టిపారేయలేం. అందుకని.. అతడని సారథిగా తప్పించి బ్యాటర్‌గా స్వేచ్ఛగా ఆడేలా చూడాలని రోహన్ గవాస్కర్, మనోజ్ తివారీలు యజమాని సంజీవ్ గొయెంకాకు సూచించారు.

'ఒకానొక ఇంటర్వ్యూలో పంత్ లక్నోకు 10-15 ఏళ్లు ఆడాలని.. పలు టైటిళ్లు గెలవాలని కోరుకుంటున్నానని సంజీవ్ గొయాంకా అన్నారు. అలాంటప్పుడు కొందరు ఆటగాళ్లను ఒత్తిడి పడకుండా చూడాలి. పంత్‌ను కెప్టెన్‌గా కొనసాగించాలా? వద్దా? అనేది లక్నో యాజమాన్యం నిర్ణయించుకోవాలి. విధ్వంసక ఆటగాడైన పంత్‌ను బ్యాటర్‌గా ఆడించాలి. ఎందుకంటే ఆకాశమే హద్దుగా చెలరేగి.. ఒంటిచేత్తో మ్యాచ్ గమనాన్ని మార్చగల సత్తా అతడి సొంతం. అయితే.. జట్టు ప్రదర్శన బాగా లేనప్పుడు ఆ ఒత్తిడి కెప్టెన్‌పై పడుతుంది.

కాబట్టి పంత్‌ను కెప్టెన్‌గా తప్పించి స్వేచ్ఛగా ఆడేలా చూడాలి' అని క్రిక్‌బజ్‌తో గవాస్కర్ వెల్లడించాడు. మనోజ్ తివారీ మాట్లాడుతూ పంత్‌కు సారథ్యమిచ్చి.. అతడిలోని బ్యాటర్‌ను మనం మిస్సవుతున్నామని అన్నాడు. 'కెప్టెన్సీ ఒత్తిడిలో పంత్ దూకుడైన ఆటను మనం కోల్పోతున్నాం. అంతర్జాతీయ క్రికెట్లో, ఐపీఎల్‌లో ఒకప్పుడు దంచేసిన అతడు.. పంతొమ్మిదో సీజన్‌లో పరుగులే చేయడం లేదు. సో.. కెప్టెన్సీ భారం నుంచి విముక్తి లభిస్తే పంత్ తన స్టయిల్లో చెలరేగుతాడు. అది లక్నో జట్టుకు ఎంతో మంచిది' అని తివారీ వెల్లడించాడు. ఐపీఎల్ 19లో ఇప్పటివరకూ ఆడిన 7 మ్యాచుల్లో ఏడింటా ఓడిన లక్నో ప్లే ఆఫ్స్ రేసు నుంచి దాదాపు నిష్క్రమించినట్టే.

## రోహిత్ ఫామ్‌లో ఉంటే అనేక జట్ల ప్లే ఆఫ్స్ ఆశలు గల్లంతు: గావస్కర్



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 కీలక దశకు చేరుకుంది. ఇప్పటికే నాలుగు జట్లు 10 మ్యాచ్‌లు, ఆరుజట్లు తొమ్మిదేసి మ్యాచ్‌లు ఆడేశాయి. ఇకపై జరిగే మ్యాచ్‌ల ఫలితాలు ఆయా జట్ల ప్లే ఆఫ్స్ అవకాశాలను ప్రభావితం చేస్తాయి. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌తో రీ ఎంట్రీ ఇచ్చిన ముంబయి బ్యాటర్ రోహిత్ శర్మ అదరగొట్టాడు. తనదైన శైలిలో విరుచుకుపడుతూ ప్రత్యర్థి జట్టు బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ మ్యాచ్‌లో హిట్‌మ్యాన్ 44 బంతుల్లోనే 84 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. రోహిత్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే కొన్ని జట్ల ప్లే ఆఫ్స్ అవకాశాలకు గండిపడుతుందని భారత మాజీ బ్యాటర్ సునీల్ గావస్కర్ అభిప్రాయపడ్డారు. రోహిత్ ఫామ్ లీగ్ ఆఖరి దశలో ముంబయిని ప్రమాదకర ప్రత్యర్థిగా మార్చగలదని ఆయన పేర్కొన్నారు.

"గత ఏడాదిగా రోహిత్ శర్మను నిశితంగా గమనిస్తున్నాను. పరిమిత ఓవర్ల క్రికెట్, ఐపీఎల్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకొన్న తర్వాత తన బ్యాటింగ్‌పైనే ఎక్కువ దృష్టి సారించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో పరుగులు సాధించాడు, స్వదేశంలో జరిగిన సిరీస్‌లోనూ రాణించాడు. ఇప్పుడు ఐపీఎల్‌లో కూడా అదే జోరు కొనసాగిస్తున్నాడు. రోహిత్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే మిగిలిన మ్యాచ్‌లలో ముంబయి ఇండియన్స్ అనేక జట్ల ప్లేఆఫ్ ఆశలకు గట్టి దెబ్బ కొడుతుంది. ప్రతి ఐపీఎల్ సీజన్‌లో అతను 400 నుంచి 500 పరుగులు చేస్తాడు. రోహిత్ 80కిపైగా పరుగులు చేసిన ఇన్నింగ్స్‌లు ఎక్కువగా ఉండవు. కానీ, అతను చేసే 40-50 పరుగులు జట్టుకు శుభారంభాన్నిస్తాయి. అతని ఆటలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు రోహిత్ మరింతసేపు బ్యాటింగ్ చేసి తనదైన ముద్రను బలంగా వేయాలనుకుంటున్నాడు" అని సన్నీ వివరించారు.

ప్రస్తుతం ఆరు పాయింట్లతో ఉన్న ముంబయికి ప్లే ఆఫ్స్ అవకాశాలు పెద్దగా లేవు. ఆ జట్టు నాలుగో స్థానానికి చేరుకోవాలంటే తమ మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ తప్పక గెలవాలి. అంతేకాదు ఇతర జట్ల ఫలితాలు కలిసొస్తేనే ముంబయి ముందజ వేసే ఛాన్స్ ఉంటుంది. ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, రాజస్థాన్ రాయల్స్‌తో ముంబయి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ సీజన్‌లో రోహిత్ శర్మ ఇప్పటివరకు 5 మ్యాచ్‌ల్లో 174.02 స్ట్రైక్‌రేట్‌తో 221 పరుగులు చేశాడు. మిగతా మ్యాచ్‌ల్లోనూ హిట్‌మ్యాన్ రాణించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# టీ20 ఫార్మాట్‌లో భారత్ ఆధిపత్యం..

**ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మరోసారి అగ్రస్థానం**

**ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్‌కు అగ్రస్థానం**

**రెండో స్థానంలో ఇంగ్లండ్, మూడో స్థానంలో ఆస్ట్రేలియా**

**వరుసగా రెండు టీ20 ప్రపంచకప్‌లు గెలవడంతో పటిష్టమైన స్థానం**

**శ్రీలంకను వెనక్కి నెట్టి 8వ ర్యాంకుకు చేరిన బంగ్లాదేశ్**

**13వ స్థానానికి ఎగబాకిన అమెరికా**




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌లో పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. మంగళవారం ఐసీసీ విడుదల చేసిన వార్షిక టీ20 పురుషుల జట్ల ర్యాంకింగ్స్‌లో భారత్ తన అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు 275 రేటింగ్ పాయింట్లతో నంబర్ వన్ స్థానంలో కొనసాగుతోంది.

గతంతో పోలిస్తే పాయింట్ల ఆధిక్యం కాస్త తగ్గినప్పటికీ, రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ (262) కంటే భారత్ స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. ఆస్ట్రేలియా జట్టు 258 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. మే 2025 తర్వాత ఆడిన మ్యాచ్‌లకు 100 శాతం, గత రెండేళ్ల మ్యాచ్‌లకు 50 శాతం వెయిటేజీ ఇచ్చి ఈ తాజా ర్యాంకులను ఖరారు చేశారు. 2024, 2026లో వరుసగా రెండు టీ20 ప్రపంచకప్‌లు గెలవడం, ఈ కాలంలో ఏ ద్వైపాక్షిక సిరీస్‌లోనూ ఓడిపోకపోవడంతో భారత్ స్థానం పటిష్ఠంగా ఉంది.

టాప్ 7 ర్యాంకుల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. న్యూజిలాండ్ (247), దక్షిణాఫ్రికా (244), పాకిస్థాన్ (240), వెస్టిండీస్ (233) వరుసగా 4 నుంచి 7 స్థానాల్లో ఉన్నాయి. శ్రీలంక ఆరు పాయింట్లు కోల్పోవడంతో, బంగ్లాదేశ్ ఒక పాయింట్ సాధించి 8వ స్థానానికి ఎగబాకింది. శ్రీలంక 9వ స్థానానికి పడిపోయింది.

ఇక ఇతర జట్ల విషయానికొస్తే, అమెరికా ఆరు రేటింగ్ పాయింట్లు సాధించి 13వ స్థానానికి చేరింది. ఇటలీ 11 పాయింట్లు పొంది మూడు స్థానాలు మెరుగుపరుచుకుని 23వ ర్యాంకుకు చేరుకోవడం విశేషం. మరోవైపు, మొజాంబిక్ ఏకంగా 15 స్థానాలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయింది.

MOVIE TIME

## విశ్వంభర బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్

### హరిగౌరవకు అప్పగించిన చిత్రబృందం



**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా సోషియో-ఫాంటసీ చిత్రం విశ్వంభరపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న చిరంజీవి, ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'బింబిసార'తో సక్సెస్ అందుకున్న దర్శకుడు మల్లిడి వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తోంది. పురాణాల నేపథ్యంలో 14 లోకాల కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విజువల్ వండర్‌గా నిలవనుందని చిత్రబృందం చెబుతోంది. లోకాలను కాపాడే రక్షకుడిగా చిరంజీవి వింటేజ్ లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. ఈ సినిమాలో చిరంజీవికి జోడీగా త్రిష కృష్ణన్ నటిస్తోంది. దాదాపు దశాబ్దం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటం విశేషం. అలాగే ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జూలై 10న ఈ చిత్రం విడుదలయ్యే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో ఆసక్తికర మార్పు చోటుచేసుకుంది.

## ఓటీటీలోకి వచ్చేసిన పాపం ప్రతాప్



**టాకీస్:** టాలీవుడ్ యంగ్ టాలెంటెడ్ నటుడు తిరువీర్ హీరోగా నటించిన లేటెస్ట్ విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'పాపం ప్రతాప్' ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రం సుమారు మూడు వారాల తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్‌కు వస్తోంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'ఈటీవీ విన్' ఈ సినిమా డిజిటల్ హక్కులను సొంతం చేసుకోగా మే 7 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఎస్పీ దుర్గా నరేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తిరువీర్ సరసన పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటించగా, అజయ్ ఘోష్ కీలక పాత్రలో మెరిశారు. తండ్రి ఇష్టానికి వ్యతిరేకంగా ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్న ప్రతాప్ అనే యువకుడికి, పెళ్లయిన మూడు రోజులకే తన భార్య దూరమవ్వడం.. ఆమె తనపై ఒక వింత ఆరోపణ చేయడం అనే ఆసక్తికరమైన పాయింట్‌తో ఈ సినిమా సాగుతుంది. గ్రామీణ నేపథ్యంలో సాగే సహజసిద్ధమైన కామెడీ మరియు భావోద్వేగాల కలయికతో రూపొందిన ఈ చిత్రం డిజిటల్ వేదికగా రాబోతుండడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# ప్రేక్షకులకు అబద్ధం చెప్పకూడదు

### 'అగ్లీ స్టోరీ'పై అవికా గోర్

### మే 22న థియేటర్లలోకి రానున్న 'అగ్లీ స్టోరీ'

**టాకీస్:** 'చిన్నారి పెళ్లికూతురు', 'ససురాల్ సిమర్ కా' వంటి సీరియల్స్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొంది, ఉయ్యాల జంపాల వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి.. అవికా గోర్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా తెలుగు చిత్రం 'అగ్లీ స్టోరీ'. తాజాగా ఈ చిత్రం గురించి అవికా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమా విషపూరిత (టాక్సిక్) ప్రేమకథలను గ్లామర్‌గా చూపించబోదని, వాటి వాస్తవ పరిణామాలను మాత్రమే ఆవిష్కరిస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అవికా గోర్ మాట్లాడుతూ, "టాక్సిక్ బంధాలను ఆకర్షణీయంగా చూపించే ఉద్దేశం మాకు లేదు. అలాంటి సంబంధాలు ఒక వ్యక్తిపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వాస్తవికంగా చూపించాలనుకున్నాం. అందుకే దానివల్ల కలిగే అసౌకర్యం, గందరగోళం, భావోద్వేగ నష్టం వంటి పర్యవసనాలపైనే దృష్టి సారించాం. పైకి అది అభిరుచిలా కనిపించినా, అది ఆరోగ్యకరం కాదనే సత్యాన్ని మా కథ చెబుతుంది" అని వివరించారు. కథ చెప్పడంలో ప్రేక్షకులకు నిజాయతీగా ఉండటమే నటిగా తన బాధ్యత అని ఆమె అన్నారు. "ప్రేక్షకులకు అబద్ధం చెప్పకూడదు. ఈ కథ ఆ పని చేయదని నేను నమ్ముతున్నాను" అని అవికా తెలిపారు. ప్రణవ్ స్వరూప్ రచన, దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రొమాంటిక్ థ్రిల్లర్ మే 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. రియా జియా ప్రొడక్షన్స్ పతాకంపై సిహెచ్ సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మించిన ఈ చిత్రంలో రవితేజ మహాదాస్యం, శివాజీ రాజా, ప్రజ్ఞా నయన్ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందించగా, శ్రీ సాయి కుమార్ దార సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తించారు.

## విజయ్ విజయంతో మారిన సీన్

### జననాయగన్ విడుదలకు క్లీయర్ కానున్న లైన్


**టాకీస్:** తమిళ స్టార్ హీరో జోసెఫ్ విజయ్ సినీ ప్రయాణంలో అత్యంత కీలకంగా నిలిచిన చిత్రం 'జన నాయగన్' ఇప్పుడు ఇండియన్ సినిమా వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాను తన ఆఖరి చిత్రంగా ప్రకటించిన విజయ్, ఇకపై పూర్తిస్థాయిలో రాజకీయాలపై దృష్టి పెట్టనున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఏర్పడింది. ప్రతిభావంతుడైన దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కించిన ఈ చిత్రం అసలు ఎన్నికలకు ముందు విడుదల కావాల్సి ఉంది. అయితే పలు కారణాల వల్ల సినిమా విడుదల వాయిదా పడింది. నిర్మాణంలో ఆలస్యం, రాజకీయ పరిస్థితులు, అలాగే అనుకోని అడ్డంకులు 'జన నాయగన్' ప్రయాణాన్ని కష్టతరం చేశాయి. ఇంతేకాకుండా, ఈ చిత్రానికి సంబంధించిన ఓటిటి డీల్ కూడా మధ్యలో నిలిచిపోయినట్లు ప్రచారం జరిగింది. అదే సమయంలో సినిమాపై ఉన్న హైప్ కూడా కొంత వరకు తగ్గిందనే అభిప్రాయాలు వినిపించాయి. ఈ పరిణామాలన్నీ కలిసి సినిమా ప్రభావం తగ్గిపోయిందనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే తాజా రాజకీయ పరిణామాలు 'జన నాయగన్'కు పూర్తిగా కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని పార్టీ ఘనవిజయం సాధించడంతో ఆయన అభిమానుల్లో అపారమైన ఉత్సాహం కనిపిస్తోంది. ఒక హీరోగా మాత్రమే కాకుండా, నాయకుడిగా కూడా విజయ్‌పై ఉన్న విశ్వాసం ఇప్పుడు మరింత బలపడింది. ఇప్పటికే గతంలో 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం' వంటి భారీ ప్రాజెక్ట్‌తో విజయ్ తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించారు. భారీ బడ్జెట్, భారీ అంచనాల మధ్య వచ్చిన ఆ సినిమా కూడా అనుమానాలను చెరిపేసి




మంచి వసూళ్లు సాధించింది. ఇప్పుడు అదే స్థాయిలో, అంతకంటే ఎక్కువగా 'జన నాయగన్'పై అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా, ఒక నటుడు ముఖ్యమంత్రిగా మారిన తర్వాత విడుదలవుతున్న అతని ఆఖరి సినిమా కావడం ఈ చిత్రానికి అదనపు క్రేజ్ తీసుకొచ్చింది. అభిమానులు ఈ సినిమాను కేవలం సినిమాగా కాకుండా, ఒక భావోద్వేగంగా చూస్తున్నారు. తమ హీరో రాజకీయాల్లో విజయం సాధించిన ఆనందంలో, ఈ సినిమాకు అపారమైన ఓపెనింగ్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. బాక్సాఫీస్ ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, 'జన నాయగన్' ఓపెనింగ్స్ కోలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా రికార్డులు బద్దలు కొట్టే అవకాశముంది. మొదటి రోజు వసూళ్లు ఊహించలేనంత స్థాయిలో ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఒకవేళ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, వసూళ్లు ఎక్కడ ఆగుతాయో అంచనా వేయడం కూడా కష్టమవుతుంది.

## హాలీవుడ్ సెన్సేషన్.. క్రిస్టోఫర్ నోలన్ 'ది ఒడిస్సీ' ట్రైలర్ విడుదల!

**టాకీస్:** హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ది ఒడిస్సీ'కి సంబంధించిన కొత్త ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. యూనివర్సల్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 17న థియేటర్లలోకి రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేయగా.. ట్రైలర్‌లో గ్రీకు వీరుడు ఒడిస్సియస్, ట్రోజన్ యుద్ధం ముగిసిన తర్వాత తన భార్య మరియు కొడుకును రక్షించుకోవడానికి రాజ్యమైన ఇథాకాకు తిరిగి వచ్చే క్రమంలో ఎదుర్కొనే సుదీర్ఘమైన, ప్రమాదకరమైన ప్రయాణామే ఈ సినిమా కథ. ఇందులో ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్ నటిస్తుండగా, అతని కుమారుడు టెలిమాకస్‌గా టామ్ హాలండ్, భార్య పెనెలోప్ పాత్రలో అన్నే హాత్వే కనిపించనున్నారు. అలాగే నింఫ్ కాలిప్సోగా చార్లిజ్ థెరాన్, పెనెలోప్‌ను వివాహం చేసుకుని రాజ్యాన్ని చేజిక్కించుకోవాలని చూసే విలన్ ఆంటినస్ పాత్రలో రాబర్ట్ ప్యాటిన్సన్ నటిస్తున్నారు. హోమర్ రాసిన పురాణ గాథ 'ది ఒడిస్సీ' ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో సైక్లోప్స్ వంటి పూరణ జీవులను నోలన్ తనదైన శైలిలో అద్భుతంగా చూపించబోతున్నట్లు తెలుస్తుంది.





పూర్తిస్థాయి ఐమాక్స్ కెమెరాలతో చిత్రీకరించిన ఈ సినిమాలోని యుద్ధ సన్నివేశాలు వెండితెరపై ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. సుమారు 250 మిలియన్ డాలర్ల భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ చిత్రం నోలన్ కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన సినిమాగా నిలవనుంది.

## సుకుమార్‌తో రామ్‌చరణ్ తదుపరి చిత్రం

### జూలైలో పట్టాలకెక్కే అవకాశం

**టాకీస్:** కథానాయకుడు రామ్‌చరణ్ 'పెద్ది' సినిమాని ఇప్పటికే పూర్తి చేశారు. ఇది జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఇప్పుడు అందరి చూపు ఆయన తదుపరి చిత్రంపై పడింది. 'ఆర్‌సీ17' వర్కింగ్ టైటిల్‌తో సెట్స్‌పైకి వెళ్లనున్న ఆ సినిమాకి సుకుమార్ దర్శకత్వం వహించనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ఓ కొలిక్కి వచ్చాయని.. సుకుమార్ దీనికి తుది మెరుగులు దిద్దడంలో తలమునకలై ఉన్నారని తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించి ఓ ఆసక్తికర కబురు బయటకొచ్చింది. ఈ కొత్త చిత్రాన్ని జులైలో పట్టాలెక్కిం చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మైత్రీకి చెందిన నిర్మాతల్లో ఒకరైన చెర్రీ వెల్లడించారు. 'రంగస్థలం' విజయం తర్వాత చరణ్ – సుక్కు కలయికలో రానున్న రెండో చిత్రం కావడంతో ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. దీనికి తగ్గట్లుగానే ఈసారి సుకుమార్ తనదైన శైలిలో మరో శక్తిమంతమైన మాస్ యాక్షన్ కథను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.